ప్రజాశక్తి

శుక్రవారం 12 ఏప్రిల్ 2024 8 పేజీలు

గుంటూరు పల్నాడు

సమస్యాత్మక ప్రాంతాలపై పోలీసుల దృష్టి

అదనపు భద్రతకు ప్రణాళికలు - కేంద్ర బలగాలతో గ్రామాల్లో ప్రదర్శనలు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

పల్నాడు జిల్లా సమస్యాత్మక గ్రామాల్లో పోలీసుల మార్చ్‌ఫాస్ట్

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో గుంటూరు,పల్నాడు జిల్లాల్లో సమస్యాత్మక గ్రామాలపై పోలీసు అధికా రులు దృష్టి సారించారు. ప్రధానంగా ఎన్నికలల్లో ఘర్షణలు జరగడానికి ఆస్కారం ఉన్న ప్రాంతాలపై ప్రత్యేక నిఘా విధించాలని నిర్ణయించారు. 2019 ఎన్నికల్లో పల్నాడు జిల్లాలోనే ఎక్కువ గ్రామాల్లో టిడిపి, వైసిపి కార్యకర్తల మధ్య దాడులు జరిగాయి. రాజుపాలెం మండలంలో అప్పటి స్పీకర్ కోడెల శివప్రసాదరావుపై కూడా దాడి జరిగింది.ఆయన్ను కొంత సేపు పోలింగ్ బూత్‌లోనే బంధించిన ఘటన చోటుచేసుకుంది. మాచర్ల, గురజాల, నర్సరావుపేట, సత్తెనపల్లి, పెదకూరపాడు నియోజకవర్గాల్లో సమస్యాత్మక గ్రామాలు ఎక్కువగా ఉన్నాయి. దాదాపు 300 గ్రామాల్లో పరస్పర ఘర్షణలకు ఆస్కారం ఉందని అంచనా వేస్తున్నారు. ఇందుకోసం పారా మిలటరీ దళాలను ఎక్కువగా వినియోగించేందుకు ఇప్పటికే అధికారులు ప్రణాళిక రూపొందించారు. పల్నాడు జిల్లాకు ఇప్పటికే పారా మిలటరీ బలగాలు చేరుకున్నాయి. వీరితో గ్రామాల్లో నిత్యం ఎదో ప్రాంతంలో మార్చ్‌ఫాస్టు నిర్వహిస్తు న్నారు. మూడేళ్ల క్రితం జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా కొన్ని గ్రామాల్లో ఘర్షణలు జరిగాయి. అయితే జిల్లా, మండల పరిషత్ ఎన్నికలను టిడిపి బహిష్కరించడంతో చాలా గ్రామాల్లోపోటీ ఏకపక్షంగా ఉండటం వల్ల కొంత మేరకు ఘర్షణలు తగ్గాయి. కానీ కొన్ని గ్రామాల్లో జనసేన, వైసిపి మధ్య ఘర్షణలు చోటుచేసుకున్నాయి. ఈసారి ఎన్నికల్లో టిడిపి, బిజెపి, జనసేన కూటమి ఒక వైపు, వైసిపి మరో వైపు ఢీ అంటే ఢీ అంటున్నాయి. ఈనేపథ్యంలో 2019 కన్నా ఘర్షణలు ఎక్కువగా జరిగే అవకాశం ఉందని నిఘా వర్గాలు అంచనా వేస్తున్నాయి. గుంటూరు లోక్‌సభ పరిధిలో కూడా తాడికొండ, .పత్తిపాడు, మంగళగిరి, పొన్నూరు నియోజక వర్గాల్లో ఘర్షణలకు ఆస్కారం ఉంది. దీంతో మొత్తంగా పోలీసు అధికారులు సమస్యాత్మక, అతి సమస్యాత్మక గ్రామాలను గుర్తించే పనిలో ఉన్నారు. అంతేగాక గత కొన్ని ఏళ్లుగా జరుగుతున్న ఎన్నికలను పరిగణలోకి తీసుకుని ఘర్షణలకు ఆస్కారం ఉన్న గ్రామాల్లో ఎక్కువ మంది పోలీసులను బందోబస్తుకు నియమించాలని యోచిస్తున్నారు. ఇటీవల మాచర్లలో ఒక కారు దగ్ధం అయిన ఘటనపై ఇప్పటికే ఎన్నికల కమిషన్ సీరియస్‌గా తీసుకుంది. మూడు రోజుల క్రితం క్రోసూరులో టిడిపి కార్యాలయం తగులబెట్టడంపై అధికారులు సీరియస్‌గా తీసుకుని నిందితులను గుర్తించే పనిలో ఉన్నారు. కారంపూడిలో ఒక పోలీసు అధికారి చేసిన వ్యాఖ్యలను టిడిపి తప్పుపట్టింది. ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసింది. పల్నాడు ఎస్‌పి బదిలీ నేపథ్యంలో కొత్త ఎస్‌పిగా బాధ్యతలు చేపట్టిన గరికపాటి బిందుమాధవ్ జిల్లాలో శాంతిభద్రతలపై దృష్టి సారించారు. రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికల నిర్వహణ కొరకు ప్రజలకు మేమున్నాము అనే భరోసా ఇచ్చేందుకు పల్నాడు జిల్లా ఎస్‌పి బిందు మాధవ్ ఆధ్వర్యంలో ప్రజలు నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరుతూ కేంద్ర సాయుధ బలగాలతో పోలీసుల కవాతు నిర్వహిస్తున్నారు. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్నందున కేంద్ర సాయుధ బలగాలతో కలిసి జిల్లా పోలీసులు ప్రజలలో భరోసా కల్పించేందుకు , ఎటువంటి అల్లర్లు జరగకుండా, ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగే విధంగా, శాంతిభద్రతలను కాపాడడానికి కేంద్ర సాయుధ బలగాల పోలీసులతో కవాతు నిర్వహిస్తున్నట్టు ఎస్‌పి తెలిపారు.

సత్తెనపల్లి మసీద్‌లో నమాజ్‌లో మంత్రి అంబటి, ఇన్‌సెట్ (తాడేపల్లిలో చిన్నారులు)

ఘనంగా రంజాన్ వేడుకలు

వార్తలు లోపలి పేజీల్లో

పూలే చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న కలెక్టర్ తదితరులు

స్ఫూర్తిప్రదాత జ్యోతిబాపూలే

జిల్లాలో ఘనంగా పూలే జయంతి వేడుకలు 2లో, లోపలి పేజీల్లో

సమావేశంలో మాట్లాడుతున్న పాశం రామారావు వేదికపైన వి కృష్ణయ్య తదితరులు

ఎన్నికల బాండ్లు అవినీతి కుంభకోణం

ప్రమాదకరమైన బిజెపి దాని మిత్రులను ఓడించాలి

ఇండియా వేదిక అభ్యర్థుల్ని గెలిపించాలి : సిపిఎం

ప్రజాశక్తి - మంగళగిరి

ఎన్నికల బాండ్లు పెద్ద అవినీతి కుంభకోణం అని, అవినీతికి బిజెపి అవినీతి చేసిందని, రానున్న సార్వత్రిక ఎన్నికల్లో బిజెపి దాని మిత్రులను ఓడించాలని సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు పిలుపిచ్చారు. గురువారం రాత్రి మంగళగిరి సిపిఎం కార్యాలయంలో సిపిఎం సమావేశం నాయకులు పి బాలకృష్ణ అధ్యక్షతన జరిగింది. రామారావు తన ప్రసంగానికి కొనసాగిస్తూ బిజెపి దేశానికి పెద్ద ప్రమాదకరంగా మారిందని, అలాంటి ప్రమాదకర పార్టీని ఆంధ్రప్రదేశ్‌లో తీసుకురావడానికి టిడిపి, జనసేన పార్టీలు పూనుకున్నాయని విమర్శించారు. లౌకికతత్వం అనే పదాన్ని తొలగించాలని ఉద్దేశంలో బిజెపి ఉందని అన్నారు. దేశవ్యాప్తంగా బిజెపికి ఎదురుగాలి వీస్తుందని, ఈ పరిస్థితుల్లో రాష్ట్రంలో బిజెపి కూటమి గెలవకుండా ఉండేందుకు సిపిఎం కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా బిజెపికి అన్ని విధాలుగా సహకరిస్తున్న అధికార వైసీపీ పార్టీని ఓడించాలని అన్నారు. మంగళగిరి అసెంబ్లీ నియోజకవర్గం నుండి ఇండియా బ్లాక్ వేదిక

2 లో

భద్రత ఏర్పాట్లను పరిశీలిస్తున్న పల్నాడు జిల్లా ఎస్‌పి జి.బిందు మాధవ్

స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద పటిష్ట భద్రత

పల్నాడు జిల్లా ఎస్‌పి బిందుమాధవ్ ఆదేశాలు

ఫిర్యాదుల స్వీకరణకు ప్రత్యేక బృందం - ఫోన్ : 9440796184

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

స్ట్రాంగ్ రూములు వద్ద భద్రత పటిష్టంగా ఉండాలని పోలీసు సిబ్బందిని పల్నాడు ఎస్పీ జి.బిందు మాధవ్ ఆదేశించారు. పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట వ్యవసాయ మార్కెట్ యార్డ్ కార్యాలయం వద్ద ఎన్నికల సామాగ్రి భద్ర పరిచిన స్ట్రాంగ్ రూముల వద్ద భద్రత ఏర్పాట్లను గురువారం ఎస్‌పి పరిశీలించారు. స్ట్రాంగ్ రూమ్ పరిసర ప్రాంతాలను, డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్, బందోబస్తు ఏర్పాట్లను క్షుణ్ణంగా పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. స్ట్రాంగ్ రూమ్ వద్ద సిబ్బంది 24గంటలు అప్రమత్తంగా ఉండాలని, స్థానిక అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుండాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ప్రశాంత వాతావరణంలో జరిగేలా పటిష్ట భద్రత మరియు బందోబస్త్ ఏర్పాటు చేశామని, ఎన్నికలు పకడ్బందీగా, నిష్పక్షపాతంగా, పారదర్శకంగా, విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని ముందస్తు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎన్నికల నిబంధలు ప్రతి ఒక్కరు పాటించాలని, ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించినట్లు

2 లో

ఏటుకూరు వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న వైసిపి నేతలు

నేడు సిఎం గుంటూరులో సిద్ధం సభ

ఏటుకూరు బైపాస్ వద్ద భారీ ఏర్పాట్లు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

సిఎం జగన్ నిర్వహిస్తున్న మేమంతా సిద్ధం బస్సు యాత్ర శుక్రవారం గుంటూరు రానుంది. ఉదయం మధ్యాహ్నం 2 గంటలకు సత్తెనపల్లి మండలం దూళిపాళ్ల నుంచి బయలుదేరి కొర్రపాడు, పేరేచర్ల జంక్షన్, హౌసింగ్ బోర్డు, నల్లపాడు, చుట్టుగుంట మీదుగా ఏటుకూరు వద్దకు చేరుకుంటారు. అక్కడ బహిరంగ సభలో పాల్గొని తిరిగి సాయంత్రం 6 గంటలకు బుడంపాడు బైపాస్ మీదుగా తక్కెళ్లపాడు, వెంగళరావు నగర్, పెదకాకాని బైపాస్ మీదుగా నంబూరు బైపాస్ వద్దకు చేరుకుంటారు. అక్కడ రాత్రి కి బస చేసి శనివారం మధ్యాహ్నం మంగళగిరి మీదుగా విజయవాడ వెళ్తారు. గుంటూరులోని ఏటుకూరు వద్ద సిఎం సభకు సంబంధించిన ఏర్పాట్లను మంత్రి విడదల రజని, ఎంపి ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, మురుగుడు హనుమంతరావు, వైసిపి గుంటూరు లోక్‌సభ అభ్యర్థి కిలారు రోశయ్య, అసెంబీ అభ్యర్థులు మేకతోటి సుచరిత, నూరిఫాతిమా, బాలసాని కిరణ్, మురుగుడు లావణ్య, అంబటి మురళీకృష్ణ, వైసిపి జిల్లా అధ్యక్షులు డొక్కా మాణిక్యవర ప్రసాద్, డిప్యూటీ మేయర్ డైమండ్ బాబు తదితరులు పరిశీలించారు. గుంటూరు లోక్‌సభ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి జనసమీకరణపై దృష్టి సారించారు.

స్ఫూర్తిప్రదాత జ్యోతిబాపూలే

ప్రజాశక్తి-గుంటూరు

సామాజిక సంస్కరణల నాందికర్త, మహిళల విద్యాభివద్ధి రూపకర్తగా మహాత్మా జ్యోతిబాపూలే దేశంలో మానవాళి ఉన్నంత వరకు చిరస్మరణీయుడని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. పూలే జయంతి సందర్భంగా గురువారం కలెక్టరేట్‌లో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పూలే చిత్రపటానికి జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి, సంయుక్త కలెక్టర్ జి. రాజకుమారి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దాదాపు 200 ఏళ్ల క్రితం అనాటి సామాజిక పరిస్థితుల నేపథ్యంలో ఊహకందని విధంగా మహిళలను విద్యావంతులుగా తీర్చటానికి విద్యాలయాలను ప్రారంభించటం, మూఢనమ్మకాలు, కుల వివక్షత నిర్మూలనకు సాంఘిక సంస్కరణలకు శ్రీకారం చుట్టిన మహెూన్నత వ్యక్తి పూలే అన్నారు. అటువంటి మహనీయుని స్ఫూర్తిని బావితరాలకు తెలియచేయాలన్నారు. కార్యక్రమంలో కలెక్టరేట్ ఎల్ సెక్షన్ సూపరింటెండెంట్ లక్ష్మయ్య , డిఆర్‌ఓ పెద్ది రోజా, జిల్లా బీసీ సంక్షేమ సాధికారిత అధికారి టి వెంకటేశ్వర్లు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద పటిష్ట భద్రత

(మొదటి పేజీ తరువాయి)

తమ దృష్టికి వస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎవరు గొడవలకు పోకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు సజావుగా జరగడానికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో 1వ, 2వ పట్టణ సిఐ లు ఎస్.ఐ లు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రత్యేక ఫోన్ నంబర్ ఏర్పాటు

ప్రశాంత వాతావరణం లో తమ ఓటు హక్కు వినియోగించుకునేలా చేయడమే పోలీసు శాఖ ప్రధాన ధ్యేయమని పల్నాడు ఎస్పీ జి. బిందు మాధవ్ అన్నారు. పల్నాడు జిల్లా వ్యాప్తంగా ఎక్కడైనా ఏదైనా అనుకొని సంఘటన జరిగితే వెంటనే పరిష్కరించే దిశగా పల్నాడు జిల్లా పోలీస్ విభాగం అడుగులు వేస్తుందని ఎస్పీ తెలిపారు. దానిలో భాగంగానే ప్రజల నుండి ఎన్నికలకు సంబంధించిన ఫిర్యాదులు అందుకోవడానికి వీలుగా ఒక బందాన్ని ఏర్పాటు చేసి, ఒక ఫోన్ నంబర్ 9440796184 కేటాయించడం జరిగిందని తెలిపారు. ఎవరైనా ఏదైనా రాజకీయ పార్టీ అయినా ఎలక్షన్ కమిషన్ జారీ చేసిన ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించిన లేదా శాంతి భద్రతలకు విఘాతం కలిగించే విధంగా ప్రవర్తించినా వెంటనే పోలీస్ వారి దష్టికి తీసుకురావాలని ఎస్పీ సూచించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించిన వారిపై చట్ట ప్రకారం తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పోలింగ్ కేంద్రాల పరిధిలోని ప్రజలతో మాట్లాడుతున్న ఎస్పీ

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ఎస్‌పి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

సార్వత్రిక ఎన్నికలు -2024 దష్ట్యా ప్రజలు ఓటు హక్కును ప్రశాంత వాతావరణంలో స్వేచ్ఛగా వినియోగించుకునే విధంగా పోలింగ్ కేంద్రాల వద్ద అన్ని రకాల ఏర్పాట్లు చేశామని జిల్లాలోని పోలింగ్ కేంద్రాలను సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక, సాధారణ అనే విధంగా విభజించామని దానికి తగ్గట్టు బందోబస్తు ఏర్పాటు చేశామని పల్నాడు జిల్లా ఎస్పీ జి.బిందు మాధవ్ తెలిపారు. నరసరావుపేట మండలం పమిడిపాడు,ములకలూరు, సత్తెనపల్లి మండలం ధూళిపాళ్ల గ్రామంలో గల పోలింగ్ కేంద్రాలను ఎస్పీ బిందు మాధవ్ గురువారం సందర్శించి అక్కడ భద్రతా ఏర్పాట్లు గురించి పోలీసు అధికారులకు సూచించారు. పోలింగ్ బూత్ పరిధిలోని ప్రజలతో మాట్లాడుతూ ఎన్నికల నియమావళిని గురించి వివరించి ప్రజలు ఏ విధంగా ఓటు హక్కును వినియోగించుకోవాలో వారికి వివరించారు. ఎన్నికల నియమావళి ఉల్లంఘన జరిగినట్లయితే పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో నరసరావుపేట, సత్తెనపల్లి డిఎస్పీలు, సీఐలు ,ఎస్ఐలు మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.

స్టేఆర్డర్ కాపీ తెచ్చేలోగానే ఇల్లు కూల్చేశారు

ప్రముఖులతో యువనేత లోకేష్ భేటీ

ప్రజాశక్తి మంగళగిరి

రాబోయే ఎన్నికల్లో ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చేనేతల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపిస్తామని యువనేత నారా లోకేష్ పేర్కొన్నారు. మంగళగిరికి చెందిన ప్రముఖులతో యువనేత నారా లోకేష్ గురువారం భేటీ అయ్యారు. మంగళగిరి 4వవార్డులో నివసిస్తున్న జంజనం మల్లేశ్వరరావు నివాసానికి వెళ్లి మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా మల్లేశ్వరరావు తమ ప్రాంతంలో నెలకొన్న సమస్యలతోపాటు చేనేతలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను యువనేత దృష్టికి తెచ్చారు. గతఏడాది అక్టోబర్ 5వతేదీన నిర్మాణంలో ఉన్న తమ భవనాన్ని ఎమ్మెల్యే ఆర్కే ప్రోద్భలంతో అధికారులు కూల్చివేశారని, తాము దశాబ్ధాలుగా ఎండోమెంట్స్ భూముల్లో నివాసం ఉంటున్నామని తెలిపారు. తాము ఇల్లు నిర్మించుంటుండగా నిలిపివేయాలని ఎండోమెంట్ అధికారులు నోటీసులు జారీచేశారు. వెంటనే తాము హైకోర్టుకు వెళ్లగా స్టే ఇచ్చింది. సంబంధిత కాపీని తెచ్చేలోపుగా అధికారులు నిర్మాణంలో ఉన్న భవనాన్ని కూల్చివేశారని వాపోయారు. లోకేష్ స్పందిస్తూ... జగన్, ఆయన సామంతరాజులకు తెలిసింది కూల్చివేతలు మాత్రమేనని అన్నారు. అధికారంలోకి వచ్చాక ఎండోమెంట్స్ వారికి ప్రత్యామ్నాయ భూమి చూపించి, దీర్ఘకాలంగా నివసిస్తున్న వారికి శాశ్వత పట్టాలిచ్చేలా తాము చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం 14వవార్డుకు చెందిన మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ కాంద్రు శ్రీనివాసరావును ఆయన కార్యాలయంలో యవనేత కలుసుకున్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు నందం అబద్దయ్య, పోతినేని శ్రీనివాసరావు, జి ధనుంజయరావు, వాకా మాధవరావు, కే అంకమ్మరావు, వద్దంటే లక్ష్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

కలసి కట్టుగా శ్రమించాలి : పెమ్మసాని

ప్రజాశక్తి-తెనాలిరూరల్

గ్రామస్థాయిలో కార్య కర్తలు, నాయకులు కలిసి కట్టుగా శ్రమిస్తే విజయం తెలుగుదేశం, జనసేన, బిజెపి కూటమి సొంతమౌతుందని గుంటూరు పార్లమెంట్ టిడిపి అభ్యర్థి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. గురువారం తెనాలి రూరల్ మండలం సంగం జాగర్లమూడిలో ఏర్పాటుచేసిన ఉమ్మడి కూటమి ఆత్మీయ సమావేశంలో నియోజకవర్గ అసెంబ్లీ కూటమి జనసేన అభ్యర్థి నాదెండ్ల మనోహర్ తో కలిసి డాక్టర్ పెమ్మసాని ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పెమ్మసాని మాట్లాడుతూ జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్ సభలకు కార్యకర్తలు, ప్రజలనుంచి విశేష స్పందన లభిస్తుందని అన్నారు. అలాంటి కార్యకర్తలతో కలిసి పనిచేయడం మాలాంటి నాయకులకు మరింత ఉత్సాహం కలిగిస్తుందని అన్నారు. చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్, నరేంద్ర మోది లాంటి అగ్రనాయకుల కలయికలో ఏర్పడిన కూటమి విజయం సాధిస్తుందని అన్నారు. నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల్లో కూటమి కార్యకర్తలు ఏకతాటిపై పనిచేయాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. పార్టీ అధిష్టానం పొందుపరిచిన మేనిఫెస్టోలో పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని అన్నారు. ఎన్నికలు సరళి, పార్టీ గుర్తు, ఓటింగ్ జరిగే విధానాలను ఓటర్లకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు అన్నాబతుని జయలక్ష్మి, సంఘం జాగర్లమూడి సర్పంచ్ పాలడుగు జయ నాగలక్ష్మి, ఎంపిటిసి పసుపులేటి వెంకట నరసమ్మ, మాజి సర్పంచ్ క్రీస్తు మనెమ్మ, టిడిపి నాయకులు వీరమాచనేని వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి తెనాలి :** యువతకు ఉపాధి, వారి ఉజ్వల భవిష్యత్తు కోసం రాష్ట్ర రాజకీయాల్లో మార్పు రావలసిన ఆవశ్యకత ఉందని లోక్ సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు భీశెట్టి బాబ్జీ అన్నారు. టిడిపి, జనసేన, బిజెపి కూటమికి లోక్ సత్తా జాతీయ అధ్యక్షులు జయప్రకాష్ నారాయణ సంపూర్ణ మద్దతు తెలిపిన నేపథ్యంలో బాబ్జీ గురువారం జనసేన కార్యాలయానికి వచ్చి మనోహర్ తో బేటీ అయ్యారు. ఈ సందర్భంగా బాబ్జీ మాట్లాడుతూ రాష్ట్ర రాజకీయాల్లో మార్పు రావాల్సిన అవసరం ఉందన్నారు. మనోహర్ మాట్లాడుతూ లోక్‌సత్తా మద్దతు తెలపటం సంతోషకరమన్నారు.

పొన్నూరులో ధూళిపాళ్ల ప్రచారం

ప్రజాశక్తి పొన్నూరు రూరల్ : పట్టణంలోని 22,23 వార్డులలో తెలుగుదేశం, జనసేన, బిజెపి ప్రకటించిన బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ, సూపర్ 6 లోని సంక్షేమ పథకాల గురించి గురువారం టిడిపి అసెంబ్లీ అభ్యర్థి నరేంద్ర కుమార్ ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంచారు. మహిళలకు, యువతకు ప్రజలకు తెలియజేస్తూ, వార్డులోని పలు ప్రజల సమస్యలను ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్, వడ్రాణం మార్కండేయులు బాబు అడిగి తెలుసుకున్నారు. ఈ సమస్యలపై సానుకూలంగా స్పందించిన ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ మాట్లాడుతూ ప్రజలహితమే అభిమతంగా పెట్టుకుని పని చేస్తానని చెప్పారు. అధికారంలోకి రాగానే సత్వర పరిష్కారానికి కృషి చేస్తానని వార్డులోని ప్రజలకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు బండ్లమూడి బాబురావు, ఎద్దు సోంబాబు, తోటకూర నరేష్, గోవతోటి రాంబాబు, గుంపుల చిన్న, కుమ్మరగుంట బాబు, దాసి సోనీ, బుస్సా అబ్రహం, కోట సురేష్, తవ్వ విజయ్, వేమ రాము, సుధీర్, సి హెచ్ ఏసుదయమ్మ, ఓడ సరోజినీ, గోవతోటి కామేశ్వరి, పదుమర్తి అబ్రహం, వేముల శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

డయేరియా బాధితులకు మాధవి పరామర్శ

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో టిడిపి అభ్యర్థి గల్లా మాధవి పర్యటించారు. ఆర్ అగ్రహారం లో డయేరియాతో మతిచెందిన మహిళ కుటుంబ సభ్యులను కలసి ఆమె పరామర్శించారు. నగరంలో గత 2 నెలల క్రిందట కూడా కలుషిత నీరు విడుదల వలన అనారోగ్యం బారిన పడి పలువురు మతిచెందిన ఘటన మరువక ముందే మరొకరు మతి చెందడం బాధాకరమన్నారు. గీతిక (21) యువతి మృతి చెందితే అధికారులు పట్టించుకోలేదన్నారు. మంత్రి విడదల రజని ఆరోగ్య శాఖ మంత్రిగా ఉన్నా ఆశాఖ అధికారులు ఈ ప్రాంతం వైపు కన్నెత్తి చూడలేదన్నారు. బాధితులకు న్యాయం జరిగే వరకు ప్రభుత్వం పై పోరాటానికి సిద్ధంగా ఉన్నామనిరూ. 10లక్షల నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రజలు నగరంలో మునిసిపల్ వాటర్ త్రాగే వారు తగుజాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. 36వ డివిజన్ శ్యామల నగర్ పార్కును సందర్శించి, వాకర్స్ తో మాట్లాడారు. 39వ డివిజన్ మారుతి నగర్ లో గురువారం గల్లా మాధవి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అనేక చోట్ల డ్రైనేజి సమస్యల వలన రోగాలు ప్రబలుతున్నాయని తమను పట్టించుకునే నాధుడు లేరని ఆవేదన వ్యక్తం చేసారు. డివిజన్ అధ్యక్షుడు సింగంశెట్టి వీరయ్య, టిడిపి నాయకులు సుఖవాసి శ్రీనివాసరావు, కసకుర్తి హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లిలో వైసిపి ప్రచారం

ప్రజాశక్తి-తాడేపల్లి

వైసిపి గుంటూరు పార్లమెంటరీ అభ్యర్థి కిలారి వెంకట రోశయ్య, మంగళగిరి నియోజకవర్గ అభ్యర్థి మురుగుడు లావణ్య విజయాన్ని కాంక్షిస్తూ తాడేపల్లి పట్టణంలోని ఎన్‌టిఆర్ కాలనీలో వైసిపి నాయకులు గురువారం ప్రచారం నిర్వహించారు. వైసిపి పట్టణ అధ్యక్షులు బుర్రముక్కు వేణుగోపాలస్వామిరెడ్డి ఇంటింటికి తిరుగుతూ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గుంటూరు జిల్లా జెసిఎస్ కన్వీనర్ ఈదులమూడి డేవిడ్ రాజు, సీనియర్ నాయకులు కళ్లం రాజశేఖర్ రెడ్డి, గరుగు శ్రీనివాస రెడ్డి, తాడేపల్లి రైతు విభాగం కన్వీనర్ బంధపు రుక్మాంగ రెడ్డి, మేకా శివప్రసాద్ రెడ్డి, సంకుర అశోక్, దాసరి కుమారి, ఇసుకపల్లి అనిల్ పాల్గొన్నారు.

ఎన్నికల బాండ్లు అవినీతి కుంభకోణం

(మొదటిపేజీ తరువా యి)

అభ్యర్థిగా సిపిఎం నాయకులు జొన్న శివశంకరరావు పోటీ చేస్తున్నారని వారిని గెలిపించాలని పిలుపునిచ్చారు. ప్రజలను ఓట్లు అడిగే పరిస్థితి సిపిఎంకే ఉందని అన్నారు. నియోజకవర్గంలో అనేక సమస్యలు పరిష్కారానికి సిపిఎం అనేక పోరాటాలు చేసిందని అన్నారు. ఆ పోరాట కేంద్రాల వద్దకు వెళ్లి సిపిఎం అభ్యర్థికి ఓట్లు అడగాలని అన్నారు. గుంటూరు పార్లమెంటుకు ఇండియా బ్లాక్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న సిపిఐ గుంటూరు జిల్లా కార్యదర్శి జంగాల అజయ్ కుమార్ ను గెలిపించడానికి కృషి చేయాలని అన్నారు. సమావేశంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు వి కష్ణయ్య, సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్ ఎస్ చంగయ్య, సిపిఎం మంగళగిరి పట్టణ కార్యదర్శి వై కమలాకర్, సిపిఎం సీనియర్ నాయకులు జెవి రాఘవులు, సిపిఎం పట్టణ నాయకులు డి రామారావు, ఎం చలపతిరావు, వివి జవహర్లాల్, ఎం బాలాజీ, బి స్వామినాథ్, ఎస్ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

తెలుగు లెంక తుమ్మల సాహిత్యం అజరామరం

ప్రజాశక్తి-గుంటూరు

ఆధునిక తెలుగు సాహిత్యంలో తెలుగు లెంక తుమ్మల సీతారామమూర్తి ధ్రువతారగా ఎప్పటికీ నిలిచి ఉంటాడని ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ వెన్ని శెట్టి సింగారావు అన్నారు.ఆచార్య ఎన్జీ రంగా ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక బందావన్ గార్డెన్స్, వెంకటేశ్వర స్వామి దేవస్థానం పద్మావతి కళ్యాణ వేదికపై 'తుమ్మల కర్షక సాహిత్యం' గ్రంథావిష్కరణ సభ నిర్వహించారు. దేవస్థానం పాలకమండలి అధ్యక్షులు చిటిపోతు మస్తానయ్య కార్యక్రమాన్ని ప్రారంభించగా తుమ్మల కళాపీఠం కార్యదర్శి సూర్యదేవర రవికుమార్ గ్రంథావిష్కరణ గావించారు. డాక్టర్ బీరం సుందరరావు మాట్లాడుతూ తుమ్మల కవిత్వంలో జాతి జీవనము, సమాజంలోని వివిధ సమస్యల సంఘటనల దక్కోణం, ఆర్ద్రత కనిపిస్తుందన్నారు. మహాత్మా గాంధీ, ఆచార్య ఎన్జీ రంగాల వీరాభిమానిగానే కాకుండా వారి సేవలపై ప్రత్యేక సాహిత్యాన్ని వెలువరించారన్నారు. సగటు రైతు జీవనంపై, వారి వ్యధలపై సాహిత్య సేద్యం చేశాడని ప్రశంసించారు. సభకు అధ్యక్షత వహించిన వికాస్ విద్యా సంస్థల అధినేత పివి శంకరరావు మాట్లాడుతూ వైద్యునిగా, న్యాయవాదిగా, ఆచార్య ఎన్జీరంగా అనుచరునిగా, సాహిత్య పోషకునిగా 'తుమ్మల కర్షక సాహిత్యం' గ్రంథాన్ని వెలువరించడంలో డాక్టర్ జక్కంపూడి సీతారామారావు కృషి శ్లాఘనీయ మన్నారు. కార్యక్రమంలో డాక్టర్ అంచె విజయలక్ష్మి, అమరావతి సాహితీ మిత్రులు వ్యవస్థాపకులు డాక్టర్ రావి రంగారావు, డాక్టర్ వి.నాగరాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

గ్రంథావిష్కరణ చేస్తున్న రవికుమార్ తదితరులు

ఎన్నికల్లో ఓడిపోతే రాజకీయాల నుంచి తప్పుకుంటా

- మరి, కాసు మహేష్‌రెడ్డి ఓడిపోతే తప్పుకుంటారు?
- గురజాల ఎమ్మెల్యే అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావు సవాల్

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

రానున్న ఎన్నికల్లో ఓడిపోతే తాను శాశ్వతంగా రాజకీయాల నుంచి తప్పుకుంటానని, అదే కాసు మహేష్‌రెడ్డి ఓడిపోతే రాజకీయాల నుంచి తప్పుకోవడానికి సిద్ధమేనా అని దీనికి మరో గంటలో మీడియా ద్వారా సమాధానం చెప్పాలని గురజాల ఎమ్మెల్యే అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావు, కాసు మహేష్ రెడ్డికి సవాల్ విసిరారు. పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశంలో శ్రీనివాసరావు మాట్లాడుతూ పిడుగురాళ్లలో నిర్వహించిన 'మేమంతా సిద్ధం' సభ వైసిపికి ముగింపు సభ అని అన్నారు. 2019లో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పిడుగురాళ్ల వచ్చినప్పుడు పిడుగురాళ్ల సున్నం వ్యాపారస్తులపై ఉన్న కేసులు ఎత్తివేస్తానని,ఆరు నెలల్లో బైపాస్ పూర్తి చేస్తామని,జానపాడు ఆర్‌ఓబి పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు కానీ, వాటి గురించిన ఊసు కూడా లేకుండా జగన్ తన ప్రసంగాన్ని ముగించారని విమర్శించారు. సున్నం వ్యాపారస్తులపై కేసులు ఎత్తివేయకుండా గతంలో ప్రభుత్వం వసూలు చేసే రాయల్టీ పనులను ప్రైవేటుకి, పెద్దిరెడ్డి కంపెనీలకు అప్పజెప్పడం వల్ల వ్యాపారస్తులు అనేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. తాము అధికారంలోకి రాగానే కేసులు ఎత్తివేసి ప్రైవేట్ చెక్‌పోస్ట్‌లను తీసివేస్తామన్నారు. గురజాల నియోజకవర్గం కోసం తాను ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సూపర్ సిక్స్ పథకాలపై ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి విమర్శలు చేశారని, మహేష్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత గురజాల నియోజకవర్గానికి ఏం చేశారో చెప్పాలని అన్నారు. నూతన మున్సిపల్ బిల్డింగుకు రెండు కోట్ల నిధులు, బైపాస్ పూర్తి చేయడానికి రైతులకు రూ.30 కోట్లు తాము తీసుకువచ్చామని, జానపాడు ఆర్‌ఓబి మేము శాంక్షన్ చేయించామని, పిడుగురాళ్ల మెడికల్ కాలేజీ ఎంపి రాయపాటి హయాంలోనే శాంక్షన్ అయిందని అన్నారు. సూపర్ సిక్స్ పేరుతో గురజాల నియోజకవర్గానికి తాము ఏర్పాటు చేసిన పథకాలకు మహేష్ రెడ్డి అనుకూలమో, వ్యతిరేకమా చెప్పాలని అన్నారు. గురజాల కేంద్రంగా పల్నాడు జిల్లా ఏర్పాటుకు, నియోజకవర్గంలోని ప్రజలకు ఉచితంగా చంద్రన్న బీమా డబ్బులు కట్టి పది లక్షలు విలువగల బాండ్లను నియోజకవర్గ ప్రజలకు ఇవ్వడానికి మహేష్‌రెడ్డి అనుకూలమా వ్యతిరేకమా అని అన్నారు. పిడుగురాళ్లలో వహించిన మేమంతా సిద్ధం సభలో టిడిపి వాళ్ల దగ్గర డబ్బుంది అని చెప్పిన మహేష్ రెడ్డి, తమ దగ్గర అవినీతి సొమ్ము ఉంటే ఐదేళ్లుగా అధికారంలో ఉన్న వాళ్లు తనను ఎందుకు జైల్లో పెట్టలేదని, తన ఆస్తులు ఎందుకు స్వాధీనం చేసుకోలేకపోయారని ప్రశ్నించారు. నియోజకవర్గ ప్రజలకు అంతా తెలుసునని నరసరావుపేటలో 500 కోట్లతో మీరు షాపింగ్ మాల్ కట్టారని గచ్చిబౌలిలో షాపింగ్ కాంప్లెక్స్ ఎవరు కడుతున్నారు అందరికి తెలుసునని తెలిపారు.

బిజెపితో పొత్తు కారణంగా నాలుగు శాతం రిజర్వేషన్ ఎత్తివేస్తారని అబద్ధ ప్రచారాలు వైసిపి వాళ్ళు చేస్తు న్నారని అన్నారు. రిజర్వేషన్లు పోనివ్వమని ముస్లింల హక్కులు కాపాడతామని, దుల్హన్ పథకం కు లక్ష రూపాయలు చేస్తామని వైసిపి ప్రభుత్వం రద్దు చేసిన పథకాలన్నీ తిరిగి తీసుకొస్తామని అన్నారు.

యరపతినేని సవాల్ ను స్వీకరించిన కాసు

ప్రజాశక్తి-పిడుగురాళ్ల : రానున్న ఎన్నికల్లో ఓడిపోతే రాజకీయాల నుంచి తప్పుకుంటావా అని యరపతినేని శ్రీని వాసరావు చేసిన సవాల్‌కు ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి స్పందించారు. మహేశ్‌రెడ్డి మాట్లాడుతూ గంటలో సమాధానం చెప్పాలన్న యరపతినేనికి గంట సమయం వృధా అని సమాధానం చెప్పడానికి పది నిమిషాలు చాలని అన్నారు.వచ్చే ఎన్నికల్లో గెలిచేది 'నేనే' అని అన్నారు. 2019 ఎన్నికల్లో చిత్తుచిత్తుగా ఓడించి ఇంటికి పంపాను గుర్తులేదా యరపతినేని అని, వచ్చే ఎన్నికల్లో మళ్లీ ఓడించి రాజకీయాల నుంచి రిటైర్మెంట్ యర పతినేనికి ఇప్పిస్తానని అన్నారు. గుంటూరులో శాశ్వతంగా కూర్చోబెట్టకపోతే 'నా పేరు కాసు మహేష్ రెడ్డి కాదు' అని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో ఓడిపోతే 'నువ్వు చెప్పేది ఏంటి .. నేనే రాజకీయ సన్యాసం తీసుకుంటాను' అని సామా జిక మాధ్యమం ద్వారా తెలిపారు.

గ్రూప్-2 ప్రిలిమ్స్ ఫలితాల్లో కెఎల్‌యు పూర్వ విద్యార్థుల విజయ బావుటా

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

నిన్న ప్రకటించిన గ్రూప్-2 ప్రిలిమ్స్ ఫలితాల్లో కె.ఎల్. డీమ్డ్ యూనివర్సిటీ బి.ఏ.(ఐ.ఏ.ఎస్) పూర్వ విద్యార్థులు సుమారు 20 మందికి పైగా విజయ కేతనం ఎగురవేశారని వర్శిటీ వైస్ చాన్సులర్ డాక్టర్ జి.పార్థసారదివర్మ గురువారం నాడు ఒక ప్రకటనలలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కెఎల్ విశ్వవిద్యాలయంలో బి.ఏ.(ఐ.ఏ.ఎస్) కోర్సులో చదివిన జనరల్ నాలెడ్జ్, సిశాట్ తమ విద్యార్థుల విజ యానికి ఎంతగానో దోహదం చేశాయన్నారు. అన్నిటికీ మించి పరీక్షకు నెల రోజుల ముందుగానే బిఎ ఐఎఎస్ విభాగాధిపతి డాక్టర్ బి.శివనాగయ్య ఆన్లైనులో ఏర్పాటు చేసిన సుమారు 60 తరగతుల కరెంట్ ఎఫైర్స్ విజ్ఞానం ఎంతగానో విజయానికిదోహదపడిందన్నారు. డాక్టర్ బి.శివ నాగయ్య మాట్లాడుతూ అందరికీ మెయిన్ పరీక్షకు కూడా ఆన్ లైనులో కరెంట్ అఫ్ఫైర్స్ తరగతులను తప్పకుండా అందిస్తామన్నారు. ఈ తరగతులు కేవలం విద్యార్థులే కాకుండా మెయిన్స్ పరీక్షలకు తయారవ్వాలంకుంటున్న యావన్మంది ఉపయోగించుకోవచ్చున్నారు.

విద్యార్థులందరికీ ప్రతిరోజు హిందూ పేపరు ఇచ్చి విశ్లేషణ చేయించటం, ప్రతి విద్యార్థికీ ప్రధాన సబ్జెక్టులకు సంబంధించిన పుస్తకాలను ఉచితంగా అందించి ఎప్పటికప్పుడు సమీక్షించటం, 24గంటలూ-365 రోజులూ లైబ్రరీ విద్యార్థులకు అందుబాటులో వుంచడం తాము పాటిస్తున్న ప్రణాళికలో కొన్ని అంశాలు మాత్రమే అన్నారు. మొదటి ఏడాది నుండే ఎన్,సి.ఇ.ఆర్.టి. పుస్తకాల బోధనతో ప్రారంభించి క్రమంగా సివిల్ సర్వీసెస్ కు సంబంధించిన ఉత్తమ పుస్తకాల పఠనం వైపు వారిని ప్రోత్సహిస్తామన్నారు. చదువే కాకుండా మానసిక వికాసం కోసం క్రీడలు, ఎన్.సి.సి., ఎన్.ఎస్.ఎస్. అత్యాధునిక జిం,యోగా వంటి అనేక సదుపాయాలను మేనేజ్మెంట్ విద్యార్థులకు కల్పిస్తోందన్నారు.

టిఎన్‌ఎస్‌ఎఫ్ అధ్యక్ష కార్యదర్శులు నియామకం

ప్రజాశక్తి- ఎఎన్‌యు

ఆచార్య నాగార్జున యూనివర్సిటీ టీఎన్ఎస్ఎఫ్ అధ్యక్ష కార్యదర్శులు నియామకం నిర్వహించినట్లు రాష్ట్ర అధ్యక్షులు ఎం.వి ప్రణవ్ గోపాల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

అధ్యక్షులుగా జి సాయి పవన్ కుమార్ (నితీష్ యాదవ్) ప్రధాన కార్యదర్శిగా డి హేమంత్ కుమార్ లను నియమించినట్లు తెలిపారు. వీరి నియామకం పట్ల పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

కవాతులో సిఐ దశరథ రామారావు, సిఆర్పిఎఫ్ బలగాలు

తెనాలిలో పోలీస్ కవాతు

ప్రజాశక్తి-తెనాలి

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు వీలుగా ప్రజలకు అవగాహన కల్పించేందుకు గురువారం రాత్రి పోలీసు కవాతు నిర్వహించారు. పట్టణ వన్ టౌన్ సిఐ దశరథ రామారావు నేతృత్వంలో సిఆర్పిఎఫ్ బలగాలు కవాతులో పాల్గొన్నాయి. పట్టణ వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో శివాజీ చౌక్, గాంధీ చౌక్, డైమండ్ సెంటర్, స్వరాజ్ టాకీస్ సెంటర్, చినరావూరు పార్క్, చినరావూరు తోట, చినరావూరు రైల్వే స్టేషన్ కూడలి, ఆర్టీవో ఆఫీస్ కూడలి, నాజర్ పేట మహాలక్ష్మి సెంటర్ సెంటర్, హిందీ ప్రేమ మండలి మీదుగా సాగింది. కార్యక్రమంలో ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

పోటీ పరీక్షలకు కేంద్రంగా వినుకొండ

ప్రజాశక్తి-వినుకొండ

డాక్టర్ పారా వెంకట లక్ష్మయ్య కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల్లో ఉన్నత ఉద్యోగాలు సాధించేందుకు అవసరమైన శిక్షణ ఇస్తూ పోటీ పరీక్షలకు కేంద్రంగా వినుకొండ లోని డాక్టర్ లక్ష్మయ్య స్టడీ సర్కిల్ ను నిలుపుతామని ఐఏఎస్ అకాడమీ వ్యవస్థాపకులు డాక్టర్ పారా వెంకట లక్ష్మయ్య పేర్కొన్నారు. గురువారం శ్రీ భ్రమర టౌన్ షిప్ జేనిత్ సిటిలోని డాక్టర్ లక్ష్మయ్య స్టడీ సర్కిల్ నందు గ్రూప్ 2 పోటీ పరీక్షల్లో ప్రిలిమినరీ లో ఉత్తీర్ణత సాధించి మెయిన్స్ కు అర్హత పొందిన విద్యార్థులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా డాక్టర్ లక్ష్మయ్య మాట్లాడుతూ వినుకొండ నుండి గ్రూప్ 2 కు శిక్షణ పొందగా 31 మంది పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించారు. అదేవిధంగా తిరుపతిలో తమ అకాడమీ ద్వారా శిక్షణ పొందిన 34 మంది మెన్స్ కు అర్హత సాధించారన్నారు. కేజీ నుండి పీజీ వరకు ఉత్తమ విద్యను అందించడమే లక్ష్యంగా తమ అకాడమీ కృషి చేస్తుందన్నారు.

ప్రముఖులతో మంత్రి రజనీ భేటి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

వచ్చే ఎన్నికల్లో వైసిపి గెలుపునకు సహకరించాలని మంత్రి విడదల రజని గుంటూరులోని పలువురు ప్రముఖులను కలిసి విజ్ఞప్తి చేశారు. వీవీఐటీ ఇంజినీరింగ్ కళాశాల అధినేత వాసిరెడ్డి విద్యాసాగర్, ప్రముఖ ఆధ్యాత్మికవేత్త బొల్లేపల్లి సత్యానారాయణ, టిడిపి సీనియర్ నాయకుడు పచ్చా పెదవెంగయ్య తదితరులను మంత్రి కలిశారు.

ఈ సందర్భంగా మంత్రి విడదల రజిని మాట్లాడుతూ రాష్ట్ర భవిష్యత్తుకు అండగా ఉండాలని కోరారు. పేదల అభ్యున్నతి కోసం తమ ప్రభుత్వ చేస్తున్న కషిలో మీరు భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. తనను గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో ఆశీర్వదిస్తే.. అండగా ఉంటానని హామీ ఇచ్చారు.

ఓట్లు వేసి గెలిపిస్తే ప్రజల గెలుపుగా మారుతుంది

ప్రజాశక్తి-తాడేపల్లి

మంగళగిరి నియోజకవర్గం నుంచి ఇండియా వేదిక అభ్యర్థిగా పోటీ చేస్తున్న సిపిఎం నాయకులు జొన్నా శివశంకరరావు, సిపిఐ గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి జంగాల అజయ్‌కుమార్‌లకు ఓట్లు వేసి గెలిపిస్తే అది ప్రజల గెలుపుగా మారుతుందని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం.సూర్యారావు, సిపిఎం నాయకులు దొంతిరెడ్డి శ్రీనివాసకుమారి చెప్పారు. గురువారం రాత్రి ఆర్ఎంఎస్‌కాలనీ, కెఎల్‌రావుకాలనీల్లో జరిగిన జనరల్ బాడీ సమావేశాల్లో వారు పాల్గొని మాట్లాడారు. దేశంలో ముస్లిం మైనార్టీలకు వ్యతిరేకంగా సిఎఎ లాంటి చట్టాలను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తీసుకొస్తుందని విమర్శించారు. ప్రజల మధ్య కులాలు, మతాలు పేరుతో చిచ్చు పెడుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో

ఎన్నడూ లేని విధంగా నిత్యావసర సరుకుల ధరలు విపరీతంగా పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. ధరలను దించాలంటే కేంద్రంలో బిజెపి రాష్ట్రంలోని వైసిపి, టిడిపి, జనసేన పార్టీలను ఓడించాల్సిన అవసరముందని చెప్పారు. మంగళగిరి నియోజకవర్గంలో అనేక వేల మంది పేదలకు స్థలాలు చూపించి ఇళ్లు వేయించిన ఘనత వామపక్షాలదేనని చెప్పారు. ఇండియా వేదిక అభ్యర్థులను గెలిపించడం ద్వారా కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టాలన్నారు. ఈ కార్యక్రమాల్లో డి.విజయబాబు. వై.శ్రీనివాసరావు, శేషు, గోపాలకృష్ణ, మట్టా రాజు, కె.మేరి, వి.సామ్యేలు, డి.యోహాన్ తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

మా క్లయింట్స్ బాదం కోటలింగం S/o. కోటయ్య R/o. D.No.16-593, పిడుగురాళ్ళ టౌన్, పల్నాడు జిల్లా వారి నుండి అనుమతి పొంది ఈ దిగువ షెడ్యూల్ ఆస్తిని సయ్యద్ జబీరుల్లా S/o. సయ్యద్ ఖాదర్ వలి R/o. D.No.13-39, పిడుగురాళ్ళ వారి నుండి కొనుగోలు చేయుటకు ఖరారు పడి అగ్రిమెంట్ పొందియున్నారు. ఈ ఆస్తిపై యెవ్వరికైనా యేమైన అభ్యంతరాలు యున్న ఎడల ప్రకటన జారీచేసిన వారం రోజులలోపు అభ్యంతరాలు తెలియజేయగలరు. లేనిచో ఎటువంటి అభ్యంతరం లేదని, పేచి లేని ఆస్తిగా భావించి మా క్లయింట్స్ పేరుపై అమ్మకందారు నుండి ఆస్తిని రిజిస్ట్రేషన్ చేయించుకుందురు.

షెడ్యూలు: పల్నాడు జిల్లా, నరసరావుపేట రిజిస్ట్రేషన్ జిల్లా, పిడుగురాళ్ళ యన్.ఆర్.ఓ. యిలాకా, పిడుగురాళ్ళ మున్సిపాలిటీలోని 19వ బ్లాకులో డోర్ నెం. 19-84/3 రుగా గలిగి అసిస్మెంటు నెం.1132015869 రుగా గలిగి పిడుగురాళ్ళ గ్రామ డి.నెం.236లో హక్కు కలిగి నాకు విక్రయించిన 291 చ॥గ॥ల స్థలము ఇందులో నిర్మాణము చేయబడిన రేకులు కప్పు గల లోగిలికి

హద్దులు :-

తూర్పు: 94 లింకులు కొలిశెట్టి వెంకటరత్నం స్థలం

దక్షిణం : 64 లింకులు వెంపటి సాంబశివరావు స్థలం.

పడమర: 94 లింకులు గుర్రం హనుమంతరావు స్థలం

ఉత్తరం : 64 లింకులు ఈ దిశ 25 లింకులు వెడల్పు గల బజారు

కొప్పుల రామి రెడ్డి
అడ్వకేట్
పిడుగురాళ్ళ - 522413.
ఫోన్ నెం. 99859 10068

అమరవీరుల స్మారక సభ రేపు

ప్రజాశక్తి-చిలకలూరిపేట

అమరుల త్యాగాలకు గుర్తుగా వారి ఆశయాలను స్మరించుకునేందుకు ప్రతి ఏడాది ఏప్రిల్ 13న యడ్లపాడు మండలం తుమ్మలపాలెంలో అమరనగర్‌లో అమరవీరుల స్మారకసభ జరుగుతుందని సిపిఎం పట్టణ కార్యదర్శి పేరు బోయిన వెంకటేశ్వర్లు చెప్పారు. గురువారం స్థానిక పండరీపురం రెండోలైన్‌లోని సిపిఎం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ పోరాటకాలంలో నిజాం నవాబుల ప్రభుత్వానికి వ్యతిరేక పోరాటానికి వెన్ను దన్నుగా సాగిన పోరాటంలో చిలకలూరిపేట నియోజకవర్గ ప్రాంత వీరత్వానికి ప్రత్యేకమైన ఆళ్ల వెంకయ్య, దండా అంకమ్మ, బండారు వెంకటప్పయ్య, దండా నారాయణస్వామి, పిల్లి అంకమ్మ, కొండ్రగుంట రాములు, మామిడాల సుబ్బారావు,కోనేటి బ్రహ్మయ్య, తల్లం శ్రీమన్నారాయణ, దమ్ము పోతురాజు, ఊపిరి మోషే, కట్ట దామోదరం గడ్డం మోషే, కాకాని రామచంద్రయ్య, ఏనుగుపాలెం కోటయ్య, దావుల గంగయ్య, సత్యనారాయణ యోధుల్ని తుమ్మలపాలెం సమీపంలో కాల్చి చంపిన విషయాన్ని గుర్తుచేశారు. వీరి గుర్తుగా తుమ్మలపాలెంలో స్మృతి చిహ్నాలు ఏర్పాటు చేసుకున్నామని అన్నారు. శ్రీకాకుళం గిరిజన ఉద్యమానికి బాసటగా నిలిచిన మన ప్రాంత అమరవీరులు చాగంటి భాస్కరరావు, బిక్కి రాములు, యోగి సుబ్బారెడ్డి పెరికల బిక్షాలు గుడివాడ జగన్నాథం దేవినేని మల్లికార్జునుడు గోరంట్ల కోటేశ్వరరావు జగదీష్ తాడిపోయిన సాంబయ్య గోగినేని వీరయ్య పదిమందిని కాల్చి చంపిన అమరుల జ్ఞాప కార్థం మరో స్థూపాన్ని నిర్మించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమా నికి సిపిఎం సభ్యులు, సానుభూతిపరులు ప్రజలు, అభి మానులు, ప్రజాసంఘాల, కార్యకర్తలు, వామ పక్షాలు, కార్య కర్తలు అధిక సంఖ్యలో పాల్గొని సభను జయప్రదం చేయాలి అన్నారు.

21న మోడల్ స్కూల్ లో ప్రవేశ పరీక్ష

ప్రజాశక్తి - రెంటచింతల

మండలంలోని జెట్టిపాలెం గ్రామంలోనే మోడల్ స్కూలులో ఆరో తరగతిలో ప్రవేశానికి పరీక్ష 21న నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ ఎం శ్రీనివాసులు తెలిపారు. ఉదయం 10 గంటల నుండి 12 గంటల వరకు ప్రవేశపరీక్ష ఉంటుందన్నారు. నెట్ సెంటర్ కి వెళ్లి ఐడి, డిఓబి ఎంటర్ చేసి హాల్ టికెట్లు పొందవచ్చని తెలిపారు.

ఉత్తమ ప్రదర్శనగా 'ఇంద్రప్రస్థం'

ప్రజాశక్తి-యడ్లపాడు

లింగారావుపాలెం. కొండవీటి కళా పరిషత్, యడ్ల పాడు పుచ్చలపల్లి సుందరయ్య కళాపరిషత్ ఆధ్వర్యంలో సంయుక్తంగా రెండు గ్రామాల్లోనూ ఈ నెల 7 వ తేదీ నుండి 10 వరకూ జరిగిన నాటిక పోటీల్లో అభినయ ఆర్ట్స్, గుంటూరు వారి 'ఇంద్రప్రస్థం' ఉత్తమ ప్రదర్శన బహుమతి తో పాటు ఎన్. రవీంద్ర రెడ్డికి ఉత్తమ దర్శకుడిగా, ఇందులో నటించిన జి.కుసుమ సాయికి ప్రత్యేక బహుమతి లభించింది. ఈ నాటిక లో విసిహెచ్‌కె ప్రసాద్‌కు ఉత్తమ నటన (5 గురి లో ఒకటి) బహుమతి లభించింది. సహ రంగస్థల నటుడు టివి, సినీ నటుడు, ఇటీవల రెండు డాక్టరేట్ లు పొందిన డాక్టర్ ముత్తవరపు సురేష్‌బాబుకు, పరిషత్ నిర్వాహకులకు పలువురు అభినందనలు తెలిపారు.

సామాజిక ఉద్యమనేత మహాత్మా జ్యోతిరావు పూలే

ఘనంగా పూలే జయంతి.. పలువురు ఘన నివాళి

ప్రజాశక్తి-సత్తెనపల్లిటౌన్

సామాజిక ఉద్యమనేత మహాత్మా జ్యోతిరావు పూలే 198వ జయంతి వేడుకలు బిసి సంఘాల ఆధ్వ ర్యంలో గురువారం ఘనంగా నిర్వ హిం చారు. ఈ కార్యమానికి ముఖ్యఅతిథిగా మంత్రి అంబటి పాల్గొని మాట్లాడుతూ సామాజిక ప్రజాస్వామ్యనికి పునాదులు వేసిన గొప్ప వ్యక్తి పూలే అని కొని యాడారు. విద్యతోనే సకల రుగ్మతులు దూరమవుతాయని, బడుగు, బలహీన వర్గాల విద్యాభివృద్ధికి ఆయన ఎనలేని కృషి చేశారని అన్నారు. డాక్టర్ బి. ఆర్ అంబేద్కర్, పూలే ఆశయాలకు అను గుణంగా ముఖ్యమంత్రి జగన్ విద్యాభి వృద్ధికి ప్రత్యేక ప్రణాళికలతో ముందుకు వెళుతున్నట్లు చెప్పారు. రాష్టంలో కార్పొరేట్ విద్యకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను ఆధునీకరించడంతో పాటు నాణ్యమైన విద్యను అందిస్తున్నారన్నారు. అనంతరం పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో బిసి నాయ కులు గుంటూరు మార్కెట్ యార్డు చైర్మన్ ఎన్.రాజానారాయణ, తుమ్మల వెంకటేశ్వర్లతో పాటు కౌన్సిలర్లు,వైసిపి అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు. సత్తెనపల్లి పట్టణంలోని తాలూకా సెంటర్ లో పత్తిపాటి హరేకృష్ణ ఆధ్వర్యంలో పూలే విగ్రహానికి పూల మాల వేసి జన్మదిన వేడుకలు నిర్వ హించారు. కార్యక్రమంలో కె.వెంక ట్రామయ్య, బి.కమలాకర్, గుంజి విజయ కుమార్, చింకా అంకమ్మరావు, పిల్లుట్ల ఆంజనేయులు పాల్గొన్నారు.

వినుకొండలోని సిపిఎం కార్యా లయంలో..

ప్రజాశక్తి-వినుకొండ

వినుకొండలోని సిపిఎం కార్యా లయంలో జరిగిన పూలే జయంతి సభకు. సిఐటియు నాయకులు జి.నవీన్‌కుమార్ అధ్యక్షత వహించారు.పూలే చిత్రపటానికి నివాళులర్పించారు. సిఐటియు, యుటిఎఫ్ నాయకులు మాట్లాడుతూ విద్య యొక్క విలువ సమాజానికి తెలియపరచి, విద్యను అందరికీ చేరువయ్యే లా కృషి చేసిన మహనీయుడు మహాత్మ జ్యోతిభా పూలే అన్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు కె.హనుమంత్‌రెడ్డి, శివరామ కృష్ణ, యుటిఎఫ్ నాయకులు రవిబాబు, అజయ్ కుమార్, సాంబశివరావు పాల్గొన్నారు. వినుకొండలోని వైసిపి కార్యాలయలో కార్యా లయంలో జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు జరుపుకున్నారు. ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు పూలే చిత్రపటానికి పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. స్థానిక శివయ్య భవన్‌లో సిపిఐ నాయ కులు పూలే చిత్రపటానికి వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నియోజక వర్గ కార్యదర్శి బూదాల శ్రీనివాసరావు ఉలవలపూడి రాము, పిన్నెబోయిన వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-చిలకలూరిపేట

అణగారిన,అట్టడుగు వర్గాల ప్రజల తొలి సంఘ సంస్కర్త జ్యోతిరావు పూలే అని రాష్ట్ర కాంగ్రెస్ ఎస్సీ సెల్ మాజీ అధ్యక్షుడు, ప్రత్తిపాడు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కొరివి వినయ్ కుమార్ అన్నారు. పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు ఎం. ప్రసన్న అధ్యక్షతన కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పూలే జయంతి కార్యక్రమం జరిగింది. చిలకలూరిపేట

చిలకలూరిపేటలోని కాంగ్రెస్ కార్యా లయంలో..

లోని గడియారం స్తంభం వద్ద గల పూలే విగ్రహానికి బిసి సంఘాల నాయకులు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. కార్యక్రమంలో ఉప్పాల భాస్కరరావు ,సమైక్య ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం మాజీ ఉపాధ్య క్షుడు మద్దుల వెంకట కోటయ్య, ఉపా ధ్యక్షుడు కస్తూరి వెంకటేశ్వర్లు ప్ర ధాన కార్యదర్శి మారుబోయిన శ్రీనివాసరావు, బీసీ సంఘం నాయకులు నారాయణరావు, వంకదారి పుల్లయ్య అవ్వారు అన్నప్ప తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - నరసరావుపేట

నరసరావుపేటలోని ఎమ్మార్పీఎస్ పల్నాడు జిల్లా కార్యాలయం లో జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కో కన్వీనర్ గుండాల ఆనంద్ మాదిగ మాట్లాడుతూ జ్యోతిరావు పూలే,సావిత్రిబాయి పూలే త్యాగాలను ఈ సమాజానికి ఈ దేశానికి తెలియ జేయాల్సిన బాధ్యత పాలకులపై ఉంద న్నారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా ఎమ్మార్పీఎస్ కో కన్వీనర్ జి.నగేష్ మాదిగ, జన జాగృతి వ్యవస్థాపకురాలు పి.రమాదేవి, టి.దేవదానం, ఎన్.సాగర్, కె.రాజమోహన్ తదితరులు పాల్గొన్నారు.నరసరావుపేటలో బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నివాళులర్పించారు. అనంతరం రాష్ట్ర అధికార ప్రతినిధి బాదుగున్నల శ్రీను మీడియాతో మాట్లాడుతూ పూలే జయంతి ఏప్రిల్ 11 ని ప్రభుత్వ సెలవు దినంగా ప్రకటించాలని కోరారు. పల్నాడు జిల్లాలో బీసీ స్టడీ సర్కిల్ ఏర్పాటు చేయాలని, ఇటీవల గురజాల

వినుకొండలోని వైసిపి కార్యా లయంలో..

బాహ్మణపల్లి వద్ద నూతనంగా నిర్మించిన మెడికల్ కాలేజీకి శ్రీ మహాత్మ జ్యోతిరావు పేరును పెట్టాలని డిమాండ్ చేసారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు ఎన్. గురు ఆంజనేయులు, పట్టణ అధ్యక్షులు కె. బాలాజీ, నియోజకవర్గ నాయకులు టి.నరసింహారావు, విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు శ్రీనివాసాచారి పాల్గొన్నారు.

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

ఇండియా వేదిక ఆధ్వర్యంలో పిడుగురాళ్లలో గురజాల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తియ్యగుర యలమందరెడ్డి, సిపిఐ, సిపిఎం పార్టీ నాయకులు పూలే విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా యలమందరెడ్డి మాట్లాడుతూ సామాజిక రుగ్మతలకు వ్యతిరేకంగా పూలే పోరాడారని అన్నారు. సిపిఎం మండల కార్యదర్శి తెలకపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ నేటి మోడీ ప్రభుత్వం సనాతన ధర్మం పేరుతో సమాజాన్ని తిరోగమనం దిశలో వెళ్లేందుకు ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. దేశ భవిష్యత్తు కోసం బిజెపికి ప్రత్యక్షంగా పరోక్షంగా మద్దతు ఇచ్చే పార్టీలను ఓడించాలని ఇండియా వేదిక అభ్యర్థులను ప్రజలను ఆదరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి జె.కృష్ణా నాయక్, దళిత బహుజన పార్టీ నాయకులు జొన్నలగడ్డ యోహాను, మహిళా సంఘం నాయకులు సుజాత, నాగలక్ష్మి పాల్గొన్నారు.

సత్తెనపల్లిలో పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మంత్రి అంబటి రాంబాబు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన పూలే జయంతి వేడుకల్లో కాంగ్రెస్ పార్టీ నరసరావుపేట పార్లమెంట్ అభ్యర్థి గర్నెపూడి అలెగ్జాండర్ సుధాకర్ పాల్గొని నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు సీదాకృష్ణ, కె.ఇమ్మాన్యుల్, మాజీ కౌన్సిలర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-అమరావతి

స్థానిక తల్లం బ్రహ్మయ్య స్మారక భవనంలో జ్యోతిరావు పూలే జయంతి సభ నిర్వహించారు. ప్రజాసంఘాల నాయకులు పలువురు పూలే చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ విషయాన్ని కెవిపిఎస్ అమరావతి తల్లం బ్రహ్మయ్య స్మారక భవనం తెలిపింది. ప్రజాసంఘాల నాయకులు బి.సూరిబాబు, ధారా ప్రసాదు, ఈ.లక్ష్మణ్, టి. సుబ్బారావు,ఎం.సుబ్రహ్మణ్యం, సూరిబాబు, ఉపాధ్యాయ సంఘం నాయకులు జి .కోటేశ్వరరావు, దేవరాజు పాల్గొన్నారు

ప్రజాశక్తి-రెంటచింతల

జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాలలు వేసి సత్రశాల టైల్ పాండ్ విద్యుత్ ప్రాజెక్టు ఎస్ ఈ వెంకట్ రమణ నివాళులర్పించారు. అనంతరం ఉద్యోగులు, కాంటాక్ట్ కార్మికుల ను ఉద్దేశించి మాట్లాడారు. కార్యక్రమంలో ఈఈ నాగరాజు, ఏవో లలితా దేవి,సుబ్బారావు సిబ్బంది పాల్గొన్నారు.

అడ్మిషన్ల పేరిట ప్రైవేటు టీచర్లపై వేధింపులు

యాజమాన్యాలపై చర్యలు తీసుకోండి: డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ప్రస్తుతం అన్ని తరగతుల విద్యార్థులకు పరీక్షలు కాలం సమీపిస్తున్న నేపథ్యంలో కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యాలు విద్యార్థులను పరీక్షలకు సిద్ధం చేయాల్సిన ఉపాధ్యాయులను అడ్మిషన్ల పేరిట బయట తిప్పడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శిలు ఆంజనేయరాజు, కోట సాయి కుమార్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేరకు పల్నాడు జిల్లా కేంద్రం కోటప్పకొండ రోడ్డులోని ప్రజా సంఘాల కార్యాలయం నుండి ప్రకటన విడుదల చేశారు. ఇప్పటికే దాదాపుగా విద్యా సంవత్సరం ముగింపుకు వచ్చిందని ప్రైవేటు పాఠశాలల్లో పనిచేస్తున్న టీచర్లకు ఎండాకాలం రెండు నెలలు కూడా అడ్మిషన్ల పేర ఇంటింటికి యాజమాన్యాలు తిప్పుతున్నాయన్నారు. అడ్మిషన్లు చేస్తేనే ఈ రెండు నెలలు జీతం వస్తుందని యాజమాన్యం ఉపాధ్యాయులకు చెప్పడంతో గత్యంతరం లేక ఉపాధ్యాయులు ఎండలు మండుతున్నప్పటికీ ఇంటింటికి తిరిగి తమ పాఠశాలలో విద్యార్థులను చేర్చాలని తల్లి దండ్రులను బతిమిలాడుతున్నారు. వేసవి సెలవుల్లో పాఠశాల లేకపోయినా ఉపాధ్యాయులకు 12 నెలల జీతం అం దించాల్సిన విద్యాసంస్థలు అడ్మిషన్ల పేర ఉపాధ్యాయులను వీధుల పాలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. నిబంధనలు ఇలా బాహాటంగా ఉల్లం ఘిస్తున్న పాఠశాలల లైసెన్సులు రద్దు చేయాలని డివైఎఫ్ఐ,ఎస్ఎఫ్ఐ తరపున డిమాండ్ చేస్తున్నట్లు పేర్కొ న్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న కారణంగా విద్యాశాఖ అధికారులపై ఎటువంటి రాజకీయ ఒత్తిళు ఉండవు కనుక ఈ ఏడాదైనా విద్యాశాఖ అధికారులు యాజమాన్యాలపై చర్యలు తీసుకొని ప్రైవేటు ఉపాధ్యాయుల హక్కులు కాపాడాలని డిమాండ్ చేశారు. ప్రయివేటు ఉపాధ్యాయులపై అడ్మిషన్ల వేధింపులు ఆపకపోతే ప్రయివేటు ఉపాధ్యాయులంద రిని ఏకం పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని హెచ్చరించారు.

గొప్ప సామాజిక ఉద్యమకారుడు పూలే

జిల్లాలో జ్యోతిబాపూలేకు ఘన నివాళి

ప్రజాశక్తి-గుంటూరు

అంటరానితనం, మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా, కుల నిర్మూలనకు, సమసమా నిర్మాణానికి ఉద్యమించిన బహుజన తత్వవేత్త, సామాజిక దార్శనికుడు జ్యోతిరావుపూలే 197వ జయంతి సందర్భంగా వివిధ సంఘాల ఆధ్వర్యంలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

సిపిఎం కార్యాలయంలో

ప్రజాశక్తి-గుంటూరు

గొప్ప సామాజిక ఉద్యమ నేత మహాత్మ జ్యోతిరావు పూలే అని, సామాజిక ఉద్యమాలు నెలకొల్పటం ద్వారా ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు అన్నారు. స్థానిక బ్రాడీపేట లోని సిపిఎం జిల్లా కార్యాలయంలో పూలే 127వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి సిపిఎం పార్టీ సీనియర్ నాయకులు ఆది నికల్సన్ పూలమాల వేసి నివాళు లర్పించారు. సిపియం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఈమని అప్పారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రామారావు మాట్లాడుతూ జ్యోతిరావుపూలే సామాజిక సంస్కరణ ఉద్యమాలను ముందుగా తన ఇంటి నుండే ప్రారంభించారన్నారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సామాజిక న్యాయంపై, రాజ్యాంగంపై పెద్ద ఎత్తున దాడి జరుగుతుందన్నారు. ప్రజాస్వామ్యాన్ని, మానవ హక్కులను హరిస్తుందన్నారు. అటువంటి పార్టీకి అంటకాగుతున్న ఇతర పార్టీలను కూడా ప్రజలు గమనించి దూరం పెట్టాలని కోరారు. పేరుకు అన్ని పార్టీలు సామాజిక న్యాయం అని పిలుపునిస్తూ ఆచరణలో తూట్లు పొడుస్తున్నాయని అన్నారు. పూలే ఆశయ సాధన కోసం సామాజిక ఉద్యమాలను ఉధృతం చేయాలని, బడుగు బలహీన వర్గాలను ఐక్యం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రజా సంఘాల నాయకులు బైరగాని శ్రీనివాసరావు, కె.అజయ్‌కుమార్, హనుమంతరావు, ఆదిలక్ష్మి, కళాధర్, జి.వెంకటేశ్వరరావు, బి.లక్ష్మణరావు, కె.పద్మ, వి. నారాయణ, మూర్తి పాల్గొన్నారు.

బిసి సంక్షేమ సంఘం నివాళి

స్థానిక ట్రావెలర్స్ బంగ్లా వద్ద ఉన్న జ్యోతి బాపూలే విగ్రహానికి బిసి సంక్షేమ సంఘం నాయకులు పూలమాల వేసి నివాళి అర్పించారు. గొప్ప సామాజిక దార్శని కుడు జ్యోతిబాపూలే అని బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు అన్నారు. అణగారిన వర్గాలు, ముఖ్యంగా మహిళల అభివృద్ధి విద్యతోనే సాధ్యమని భావించి పూలే తన భార్య సావిత్రిబాయి పూలేకు ముందు విద్యను అందించి, ఆమెను దేశంలోనే తొలి మహిళా ఉపాధ్యాయు రాలిగా తీర్చిదిద్దారన్నారు. కార్యక్రమంలో సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి కుమ్మరక్రాంతికుమార్, రాష్ట్ర గౌరవాధ్యక్షులు కన్న మాస్టారు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అన్నవరపు నాగమల్లేశ్వరరావు, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ కోలా అశోక్, కొల్లికొండ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

బీమ్ భారత్ కార్యాలయంలో..

స్థానిక అరండల్‌పేటలోని బీమ్ భారత్ కార్యాలయంలో జ్యోతిబాపూలే చిత్రపటానికి సంఘ నాయకులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. బీమ్ భారత్ రాష్ట్ర అధ్యక్షులు పాగళ్ల ప్రకాష్ పూలే జీవిత విశేషాలను వివరించారు. కార్యక్రమంలో దళిత, బహుజన సంఘాల నాయకులు సురేష్, అంకం శ్యామ్, బి.కోటేశ్వరరావు, టి.సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి పెదనందిపాడు రూరల్

జ్యోతిరావు పూలే జయంతి పెదనందిపాడు లోని తేళ్ల నారాయణ విజ్ఞాన కేంద్రంలో గురువారం విజ్ఞాన కేంద్రం కార్యక్రమాల కమిటీకో కన్వీనర్ కొత్త వెంకటశివరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా విజ్ఞాన కేంద్రం ట్రస్ట్ కన్వీనర్ దొప్పలపూడి రమేష్ బాబు ,ఎస్ టి యు జిల్లా నాయకులు గేరా మోహన్ రావు తదితరులు పూలే చిత్ర పటానికి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడారు. ఆనాడు సమాజంలో ఉన్న కులవివక్ష, అంటరానితనం రూపుమాపాలని, మహిళలు అందరికీ విద్య అందాలని, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం జ్యోతిరావు పూలే కృషి చేశా రన్నారు. బాలిక విద్య, మహిళా హక్కుల కోసం జ్యోతిరావు పూలే వారి భార్య సావిత్రిబాయి పూలే విశేష కషి చేశారని, మహిళల అభ్యున్నతి సమాజాభివృద్ధిలో వారి భాగస్వామ్యం ఉండాలని కృషి చేశారని తెలిపారు. కార్యక్రమంలో విజ్ఞాన కేంద్రం సభ్యురాలు పి భువనేశ్వరి, కుట్టు శిక్షణా టీచర్ నల్లమోతు భారతి, మణి టీచర్, కమిటీ కన్వీనర్ జంపని రామారావు, సభ్యులు ముద్దన వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

తెలుగు దేశం పార్టీ ఆధ్వర్యంలో

ప్రజాశక్తి-తాడేపల్లి :అంటరానితనం, కుల వ్యవస్థ, అణగారిన కులాలకు విద్యను అందించడంలో జ్యోతిరావు పూలే కృషి ఎనలేనిదని టీడీపీ తాడేపల్లి పట్టణ అధ్యక్షులు వల్లభనేని వెంకట్రావు అన్నారు మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా తాడేపల్లి టీడీపీ కార్యాలయంలో పూలె చిత్రపటానికి టీడీపీ నాయకులు కార్యకర్తలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

ప్రజాశక్తి తాడేపల్లి రూరల్ : సామాజిక ఉద్యమ కెరటంగా ఎదిగిన పూలే జీవితం అందరికీ ఆదర్శనీయమని టీడీపీ తాడేపల్లి మండల అధ్యక్షులు అమరా సుబ్బారావు అన్నారు. జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా గురువారం ఎంటిఎంసీ పరిధిలోని కుంచనపల్లిలో టిడిపి మండల కార్యాలయంలో పూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కానుగోలు కోటేశ్వరరావు, అరవపల్లి శ్రీనివాస్, కంచర్ల రంగారావు, శేషంశెట్టి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి పొన్నూరు రూరల్ : పొన్నూరు పట్టణంలోని మామిళ్ళపల్లి బస్టాండ్ సమీ పంలో ఉన్న జ్యోతిరావు పూలే విగ్రహానికి టిడిపి అసెంబ్లీ అభ్యర్థి నరేంద్ర కుమార్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

సిపిఎం గుంటూరు జిల్లా కార్యాలయంలో పూలే చిత్రపటానికి నివాళి

బీమ్ భారత్ కార్యాలయంలో నివాళి


తాడేపల్లి టిడిపి కార్యాలయంలో

కుంచనపల్లిలో

పెదనందిపాడులో



పొన్నూరులో

వర్సిటీలో పూలే విగ్రహానికి నివాళి

నాగార్జున వర్సిటీలో పూలే జయంతి

ప్రజాశక్తి - ఏఎన్‌యు : ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి ఉత్సవాలను మహాత్మా జ్యోతిరావు పూలే అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. అనంతరం అధ్యయన కేంద్ర కార్యాలయంలో మహాత్మా జ్యోతిరావు పూలే అధ్యయన కేంద్రం సంచాలకులు ఆచార్య.యం. త్రిమూర్తి రావు, డాక్టర్ అంబేద్కర్ చైర్ కోఆర్డినేటర్ ఆచార్య వై. అశోక్ కుమార్, గాంధీ అధ్యయన కేంద్రం కోఆర్డినేటర్ ఆచార్య కె. సోమశేఖర్, పూలే దంపతుల చిత్ర పటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

పారిశుధ్య కార్మికుల సమావేశంలో మాట్లాడుతున్న వై నేతాజీ

పారిశుధ్య కార్మికులకు జీతాలు చెల్లించాలి

ప్రజాశక్తి-తాడేపల్లి :మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని రాజధాని విలీన గ్రామాల్లో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులకు వెంటనే జీతాలు చెల్లించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.నేతాజీ అధికారులను కోరారు. వరుసగా పండుగలు వస్తున్న నేపథ్యంలో 11వ తేదీ వచ్చినా జీతాలు పడకపోవడం పట్ల పేద కార్మిక కుటుంబాలు ఇబ్బంది పడుతున్నాయని ఆందోళన వెల్లిబుచ్చారు. పారిశుధ్య నూటికి 99 శాతం మంది రెక్కాడితే గానీ డొక్కాడని పేద కుటుంబాలే అని, అధికారులు తక్షణమే స్పందించాలని ఆయన కోరారు. గురువారం ప్రకాష్‌నగర్ సిఐటియు కార్యాలయంలో జరిగిన పారిశుధ్య కార్మికుల విస్తృత సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సంవత్సరం నుంచి కార్మికులకు కొబ్బరినూనె, చెప్పులు, గ్లౌజులు, రక్షణ పరికరాలు ఇవ్వడంలేదని చెప్పారు. కార్మికులు తమ జీవితాలను ఫణంగా పెట్టి పని చేయాల్సి వస్తుందని చెప్పారు. అధికారులు ఆ దిశగా పని చేయాల్సి వస్తుందని కోరారు. సమావేశంలో సిఐటియు పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు, నాయకులు బూరుగ వెంకటేశ్వర్లు, సంతోషం, వనమా సతీష్, కొండయ్య, అనూష పాల్గొన్నారు.

ఎర్రబాలెంలో ప్రచారంలో పాల్గొన్న సిపిఎం అభ్యర్థి జొన్నా శివశంకరరావు తదతరులు

వైసిపి, టిడిపి కూటమిని ఓడించండి

ఇండియా వేదిక బలపర్చిన అభ్యర్థుల్ని గెలిపించాలని విస్తృత ప్రచారం

ప్రజాశక్తి -మంగళగిరి రూరల్, తాడేపల్లి

మంగళగిరి మండలం ఎర్రబాలెం గ్రామంలో ఇండియా వేదిక బలపరిచిన సిపిఎం అభ్యర్థి జొన్న శివశంకర్ రావు గురువారం ప్రజలను కలిసి ఓట్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా సిపిఎం రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం రవి మాట్లాడుతూ మార్పు కోసం, అభివృద్ధి కోసం మంగళగిరి నుండి సిపిఎం అభ్యర్థిని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఇండియా కూటమి అభ్యర్థి జొన్న శివశంకరరావు మాట్లాడుతు ఇల్లు కూల్చే వారిని, ఉత్తమాటలు చెప్పేవారిని నమ్మి మోసపోకండనీ విజ్ఞప్తి చేశారు.ప్రజల పక్షాన నికరంగా నిలిచే కమ్యూనిస్టులకు ఓటు వేయాలని కోరారు. మంగళగిరి ప్రాంతాన్ని రాజకీయాలకతీతంగా అభివద్ధి చేసిన నిమ్మగడ్డ రామ్మోహనరావు వారసులకే ఓటు వేసి గెలిపించాలన్నారు. చెట్టుకు పోసే నీరు, సిపిఎం కేసే ఓటు వృధాకాదన్నారు. మంగళగిరి ప్రాంతంలో త్యాగాల చరిత సిపిఎం దని చెప్పారు. మంగళగిరి నియోజకవర్గంలో 20వేల మంది పేదలతో ఇల్లు వేయించి, కేసులను ఎదుర్కొని ఆ ఇళ్లను నిలబెట్టిన ఘనత సిపిఎం దే నని చెప్పారు.

మునిసిపల్ కార్పొరేషన్ వద్దు బాబోయ్ అంటున్న ప్రజల నెత్తిపై కార్పొరేషన్ను తెచ్చిపెట్టి ఇంటి పన్నులు అడ్డగోలుగా పెంచి భారాలు వేస్తారా అని దానికి అధికార ప్రతిపక్షాలే సమాధానం చెప్పాలన్నారు. దానితోపాటు చెత్త పైన కూడా పన్ను వేసే చెత్త ప్రభుత్వాల కు గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. విద్యుత్ ఛార్జీలను ఇబ్బడి, ముబ్బడిగా పెంచుతున్న పాలకులను ఎన్నుకోవడం ప్రజలకు అవసరమా అని ప్రశ్నించారు. బ్లాక్ మార్కెట్ దారులను నియంత్రించ లేని, అధిక ధరలను అరికట్టలేని అసమర్ధ ప్రభుత్వాలపై ప్రజలు సమర శంఖం పూరించాలన్నారు. పచ్చి నిరంకుషత్వ, మతోన్మాద, ప్రజా వినాశకర బిజెపి కూటమిని ఓడించాలన్నారు. లౌకిక రాజ్యాంగ పరిరక్షణ కోసం పోరాడుతున్న ఇండియా కూటమి అభ్యర్థులను గుంటూరు పార్లమెంట్ నుండి సిపిఐ అభ్యర్థి జంగాల అజయ్ కుమార్ ను మంగళగిరి అసెంబ్లీ నియోజకవర్గం నుండి సిపిఎం అభ్యర్థి జొన్న శివశంకరరావును గెలిపించవలసిందిగా వారు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాజధాని డివిజన్ నాయకులు ఎం భాగ్యరాజు, అత్తలూరి వీర వెంకయ్య, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-తాడేపల్లి : మతతత్వ బిజెపికి తొత్తులుగా వ్యవహిస్తున్న టిడిపి, వైసిపిలను రానున్న ఎన్నికల్లో ఓడించాలని ఇండియా కూటమి బలపరిచిన సిపిఎం మంగళగిరి నియోజకవర్గ అభ్యర్థి జొన్నా శివశంకరరావు కోరారు. పెనుమాకలో జరిగిన విస్తృత సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ కేసులకు భయపడి బిజెపిని చూసి గడగడ వనికే వారు రాష్ట్రానికి ఏం మేలు చేస్తారని ప్రశ్నించారు. కార్యక్రమంఓల సిపిఎం రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం.రవి నాయకులు ఎస్‌కె ఎర్రపీరు, ఎస్‌కె ఖాదర్ బాబా, కళ్లం వేణుగోపాలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిస్టుల ప్రాతినిధ్యం చట్టసభల్లో పెరగాలి : ముప్పాళ్ల

ప్రజాశక్తి మంగళగిరి : రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఇండియా వేదిక అభ్యర్థులను గెలిపించుకోవాలని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరావు అన్నారు. గురువారం పాత మంగళగిరిలో ఇటీవల చనిపోయిన సీనియర్ సిపిఐ నాయకులు మర్రి సాంబశివరావు సంస్మరణ సభలో ప్రసంగించారు. సాంబశివరావు జీవించినంత కాలం కమ్యూనిస్టు గాని ఉన్నారని అన్నారు. పాలక పార్టీలుగా ఉన్న వైసిపి, టిడిపి, బిజెపి పార్టీలు పేద ప్రజలకు నష్టం కలిగించే విధానాలను ఆలంబిస్తున్నారని విమర్శించారు. కమ్యూనిస్టుల ప్రాతినిధ్యం చట్టసభల్లో పెరగాలని కోరారు. గుంటూరు పార్లమెంట్ అభ్యర్థిగా సిపిఐ తరపున జంగాల అజయ్ కుమార్, మంగళగిరి అసెంబ్లీ నియోజకవర్గానికి సిపిఎం తరపున జొన్న శివశంకర్ రావు పోటీ చేస్తున్నారని వారిని గెలిపించుకోవాలని కోరారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు చిన్ని తిరుపతయ్య, కంచర్ల కాసియా, జాలాది జాన్ బాబు, సిపిఎం సీనియర్ నాయకులు పి బాలకష్ణ, సిపిఎం పట్టణ కమిటీ నాయ కులు మున్నంగి చలవ తిరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భ ంగా సాంబశివరావు చిత్రప టానికి పూల మాలవేసి నివాళులర్పించారు.

నివాళులర్పిస్తున్న ముప్పాళ్ల తదితరులు

ఘనంగా రంజాన్ వేడుకలు

వినుకొండలో ముస్లింలతో కలిసి ప్రార్థనల్లో పాల్గొన్న జీవీ, మక్కెన

20 ఏళ్ల పాటు ముస్లిం విద్యార్థులకు ఉపకారవేతనాలు

జీవీ ఆంజనేయులు ప్రకటన

ప్రజాశక్తి-వినుకొండ

తెలుగుదేశం పార్టీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు ముస్లింలకు తనదైన రంజాన్ కానుక ప్రకటించారు. పవిత్రమైన రంజాన్ పర్వదినం సందర్భంగా స్థానిక మైనార్టీ విద్యార్థుల చదువులకు అండగా నిలిచేందుకు కొత్తగా తన వ్యక్తిగతంగా ఉపకార వేతనాల కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు వెల్లడించి వారందర్నీ ఆనందశ్చర్యాల్లో ముంచెత్తారు. గురువారం వినుకొండ తిమ్మాయపాలెం రోడ్‌లోని ఈద్గా వద్ద మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావుతో కలిసి ఈద్ ఉల్ ఫితర్ ప్రార్థనల్లో పాల్గొన్నారు. జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ తన వ్యక్తిగత స్థాయిలో పేద ముస్లిం విద్యార్థుల చదువు కోసం ఏటా 100 మందికి చొప్పున రాబోయే 20 ఏళ్ల పాటు ఉపకార వేతనాలు అందిస్తానని కీలక ప్రకటన చేశారు. 50 మంది బాలికలు, 50 మంది బాలురకు ఉపకార వేతనాలు అందిస్తామన్నారు. వినుకొండ నియోజకవర్గంలో ఎక్కడ మసీదు కట్టినా తన వద్దకు పంపించాలని.. తన వంతు సహాయ సహకారాలు తప్పకుండా చేస్తానని చెప్పారు. వీటితో పాటు ముస్లింలకు ఎప్పుడు ఏ అవసరం వచ్చినా తన అండదండలు ఎల్లప్పుడూ ఉంటాయని స్పష్టం చేశారు.

ఇంటింటికీ ఎన్నికల ప్రచారం

ప్రజాశక్తి-విజయపురిసౌత్

మాచర్ల మండలం విజయపురిసౌత్ లో టిడిపి నేతలు ఇంటింటికీ బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం గురువారం నిర్వహించారు. టిడిపి నాయకులు ఇంటింటికీ వెళ్లి టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే నెరవేర్చే హామీలన్నింటిని స్థానికులకు కరపత్రాల ద్వారా వివరించారు. ఈ సందర్భంగా విజయపురిసౌత్ టిడిపి అధ్యక్షుడు బొల్లా వెంకటేశ్వర్లు చౌదరి మాట్లాడుతూ రాష్ట్ర ప్రగతిని పరుగులు పెట్టించేందుకు చంద్రబాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం దోహదం చేస్తుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సత్తిబాబు,ఆడెపు కోటయ్య, ఎరిపల్లి వెంకటేశ్వర్లు,మైలపల్లి అప్పలరాజు,రామ్ చంద్,పవన్ కుమార్,వి.సూకరాజు,ఏసుబాబు,యాకోబు,రాజేశ్, అశోక్,శ్రీను పాల్గొన్నారు.

టిడిపిలో చేరికలు

ప్రజాశక్తి-చిలకలూరిపేట

టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహకార్యదర్శి మల్లెల రాజేష్ నాయుడు ఆధ్వర్యం లో గురువారం తెలుగుదేశం పార్టీలో ప్లంబర్స్ యూనియన్ కు చెందిన 50 కుటుంబాలకు చెంది న 300 మంది ప్లంబింగ్ కార్మికులు చేరారు. స్థానిక పండారిపురంలో గల ప్రత్తిపాటి పుల్లారావు నివాసంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మాజీ మంత్రి రాష్ట్ర ఉపాధ్యక్షులు పుల్లా రావు మాట్లాడారు.

ప్రజాశక్తి-సత్తెనపల్లి టౌన్

మత సామరస్యానికి , ప్రేమకు ప్రతీక రంజాన్ పండగని మంత్రి అంబటి రాంబాబు అన్నారు. గురువారం ఆయన రంజాన్‌ని పురస్కరించుకొని స్థానిక ఈద్గాలో ముస్లిం మతపెద్దలతో కలిసి ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్నారు. ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముస్లింలు రంజాన్ పండగను అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించుకోవడం ఈ పండుగ ప్రత్యేకత అని అన్నారు. ముస్లింల అభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు.

ప్రజాశక్తి-విజయపురిసౌత్

రంజాన్ పర్వదిన వేడుకలను విజయపురిసౌత్‌లో ఘనంగా నిర్వహించారు. స్థానిక ఈద్గాలో ముస్లింలు ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక మసీదు అధ్యక్షుడు ఎస్ రహంతుల్లా, వినయతుల్లా,జాని,అబ్దుల్ సలాం, ఎస్ కె ఖాసీం,మస్తాన్ వలి, ఎండీ అన్వర్, షేక్ మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-మాచర్ల

స్థానిక ఈద్గాల వద్దకు అధిక సంఖ్యలో ముస్లిం సోదరులు చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ముస్లింలకు ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డి శుభాకాంక్షలు తెలిపారు.

ప్రజాశక్తి-వినుకొండ

వినుకొండ పట్టణంతో పాటు గ్రామస్థాయి వరకు ముస్లింలు వారి వారి స్థానిక ఈద్గాలు, దర్గాలు, మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ప్రార్థనలు అనంతరం ఆలింగనం చేసుకొని రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పట్టణంలోని తిమ్మాయపాలెం రోడ్‌లోని ఈద్గా వద్ద సామూహిక ప్రార్థనలు నిర్వహించారు. ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు, పల్నాడు జిల్లా టిడిపి అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, మక్కెన మల్లికార్జునరావులు సామూహిక ప్రార్థనలో పాల్గొన్నారు.

ప్రజాశక్తి-తెనాలి

రంజాన్ పర్వదిన వేడుకలను గుంటూరు జిల్లా తెనాలి పట్టణంలో, రూరల్ పరిధిలో ఘనంగా నిర్వహించారు. పెద్ద ఎత్తున మసీదుల్లో నిర్వహించిన ప్రార్థనలలో పాల్గొన్నారు. ప్రార్థనల అనంతరం వారి పితరుల సమాధుల వద్ద నివాళులర్పించారు. పట్టణంలోని 25 మసీదుల పరిధిలోని ముస్లింలంతా స్థానిక చించిపేటలోని ఈద్గా మైదానంలో నిర్వహించిన ప్రార్థనలలో పాల్గొన్నారు. ఎండ తీవ్రతకు తట్టుకునే విధంగా పెద్ద ఎత్తున షామియానాలు, తాగునీరు తదితరాలను ఈద్గా ప్రాంగణంలో అందుబాటులో ఉంచారు. ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పాల్గొని ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. అలాగే చినరావూరు ఈద్గాలో కమిటీ అధ్యక్షులు షేక్ వలి పర్యవేక్షణలో హఫీజ్ షేక్ అహ్మద్ అలీ ఆధ్వర్యంలో ప్రార్థనలు జరిపారు. పినపాడు మసీదు అధ్యక్షులు బాబావలి పర్యవేక్షణలో మౌలానా

మాచర్లలో ప్రార్థనలు నిర్వహిస్తున్న ముస్లింలు

మహమూద్ హసన్ ఆధ్వర్యంలో నమాజ్ జరిగింది. వహాబ్ రోడ్డు లోని మదీనా మసీద్ లో ముక్తి ఉస్మాన్ సాహెబ్ ఆధ్వర్యంలో, ఇస్లాంపేటలోని మర్కజ్ మసీదులో మౌలానా అబ్దుల్లా నేతృత్వంలో, పాండురంగపేట మక్కా మసీదులో మౌలానా ఇమ్రాన్ ఆధ్వర్యంలోనూ, మారిసుపేట మసీదులో ముక్తి షాహిద్ సాహెబ్ ఆధ్వర్యంలో నమాజ్ జరిపారు.

ప్రజాశక్తి -పొన్నూరు రూరల్

పొన్నూరులోని డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం రోడ్డులోని ఈద్గాలో, మసీదుల్లో పొన్నూరు పట్టణ పరిసర ప్రాంతాలలోని

...రు ముస్లిం పెద్దలు మాట్లాడుతూ ప్రేమ, సోదర భావం,శాంతికి చిహ్నమే రంజాన్ పర్వదినమన్నారు. ముస్లిం పెద్దలు ఎం.డి.గోరేబాబు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-మంగళగిరి

ఈద్-ఉల్-ఫితర్ పర్వదినాన్ని పురస్కరించుకొని యువనేత నారా లోకేష్ మంగళగిరి అంజుమన్- యి-హిమాయతుల్ ఇస్లాం ఈద్గాను సందర్శించారు. ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపిన ఆయన వారితో కలిసి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు.

మంగళగిరి నిడమర్రు రోడ్డులోని

మంగళగిరి-తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని పోలకంపాడులోని మస్జీద్ ఎ బిలాలలో..

ముస్లింలు ఈద్-ఉల్-ఫితర్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ప్రార్థనలకు ముందు ముస్లిం సోదరులు ఫిత్రా, జకాత్, సదఖా దానధర్మాలు చేశారు.ఈ సందర్భంగా ఈద్-ఉల్-ఫితర్ ప్రాముఖ్యత గురించి నూర్ మసీదు మౌలానా మునీర్ అహ్మద్ వివరించారు. అనంతరం నరేంద్ర కుమార్, అంబటి మురళీకృష్ణ మాట్లాడారు.

ప్రజాశక్తి-తాడేపల్లి

రంజాన్ వేడుకలను మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని పోలకంపాడులోని మస్జీద్ ఎ బిలాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా పలువ

అరవిందా హైస్కూల్ ఆవరణలో ముస్లిం మహిళలు, పురుషులు వేరువేరుగా రంజాన్ సామూహిక ప్రార్థనలు నిర్వహించారు. మత పెద్ద రంజాన్ ఈద్ నమాజ్ జరిపించారు. మంగళగిరి నియోజకవర్గ వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థిని మురుగుడు లావణ్య, సత్యం దంపతులు, మాజీ ఎమ్మెల్యే కాండ్రు కమలతో కలిసి ఈద్ నమాజులో వేర్వేరుగా పాల్గొని ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం లావణ్య ముస్లిం మహిళలను ఆలింగనం చేసుకుని, రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.

వినుకొండలో ముస్లింలతో కలిసి ప్రార్థనల్లో పాల్గొన్న ఎమ్మెల్యే బ్రహ్మనాయుడు

వైసిపిలో ఎవరూ మిగిలే పరిస్థితి లేదు: టిడిపి

ప్రజాశక్తి-వినుకొండ

కొంతకాలంగా రాష్ట్రంలో నెలకొన్న రాజకీయ పరిణామాలు చూస్తే రౌడీలు, కబ్జాకోరులు తప్ప అధికార వైసిపిలో ఎవరూ మిగిలే పరిస్థితి లేదని తెలుగుదేశం పార్టీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు విమర్శించారు. బెదిరించడం, దోచుకోవడం, దాడులు చేయడం, హత్యారాజకీయాలు, అబద్ధపు ప్రచారాలే ఆ పార్టీలో కొనసాగడానికి ప్రాథమిక అర్హతలుగా కనిపిస్తున్నాయని అన్నారు. గురువారం బొల్లాపల్లి మండలం గండిగనుముల పైతండా నుంచి 20 కుటుంబాలు, నూజెండ్ల మండలం ములకలూరు నుంచి 10 కుటుంబాలు వైసిపిని వీడి తెలుగుదేశంలో చేరాయి. వినుకొండలోని

పార్టీ కార్యాలయంలో జీవీ ఆంజనేయులు సమక్షంలో తెలుగుదేశంలో చేరారు. అనంతరం మీడియాతో ఆంజనేయులు మీడియాతో మాట్లాడుతూ వైసిపి నేతల తీరును దుయ్యబట్టారు. పల్నాడు ప్రాంతాన్ని కరవు పరిస్థితులదాటించి సస్యశ్యామలం చేసే పార్టీకి, ప్రశాంత పల్నాడుకు భరోసా ఇచ్చే నాయకులనే ఈసారి ఎన్నికల్లో ఎమ్మెల్యేలు, ఎంపీగా ఎన్నుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

'అభివృద్ధి జరగాలంటే టిడిపినే'

ప్రజాశక్తి-మాచర్ల :

మన ప్రాంతం అభివృద్ధి జర గాలంటే తెలుగుదేశం పార్టీని గెలిపించాలని టిడిపి అభ్యర్థి జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. గురువారం మాచర్ల పట్టణంలో విస్తృతంగా పర్యటించిన బ్రహ్మారెడ్డి ఇంటింటికి తిరిగి ఓట్లను అభ్యర్థించారు. సంక్షేమంతో పాటు అభివృద్ధి జరగాలి కానీ మాచర్ల నియోజకవర్గంలో ఎక్కడా అభివృద్ధి కనపడటం లేదన్నారు. టిడిపి హయాంలో జరిగిన అభివృద్ధి మినహా ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి 15 ఏళ్ళు అధికారంలో ఉండి ఎటువంటి అభివృద్ధి జరగలేదన్నారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే మాచర్ల పట్టణానికి నీటి సమస్య లేకుండా ప్రతి ఇంటికి కుళాయి పాటు చేసి నీళ్ళు అందిస్తామని అన్నారు ప్రతి నియోజకవర్గ కేంద్రాల్లో ఉపాధి అవకాశాలు కల్పిస్తామని, మౌలిక సదు పాయాలు కల్పనలో రాజీలేకుండా అభివృద్ధి పనులు చేస్తామని భరోసా కల్పించారు.

అధికారుల నిర్లక్ష్యంతో తుప్పుపట్టిన గేటు

నిర్లక్ష్యానికి గురైన తెనాలిలోని ఫైకస్ పార్కు

ఐదేళ్ళగా నిలిచిపోయిన 'ఫైకస్ పార్కు' పనులు

తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు - ఎన్నికల వేళ హడావుడి.. నామమాత్రపు పనులకు శ్రీకారం

ప్రజాశక్తి-తెనాలి

స్థానిక విస్సార్ అండ్ ఎన్వీఆర్ కళాశాల రోడ్డులో పట్టణ సుందరీకరణ, పార్కుల అభివృద్ధిలో భాగంగా 'ఫైకస్ పార్కు' ఏర్పాటుకు అధికారులు శ్రీకారం చుట్టారు. వాస్తవానికి 2010లో పట్టణానికి రక్షిత మంచినీటిని అందించేందుకు అప్పటి ఎంపి వల్లభనేని బాలశౌరి, ఎమ్మెల్యే నాదెండ్ల మనోహర్ రూ.100 కోట్లతో పనులను ప్రారంభించారు. ఆదే సమయంలో ఓవర్ హెడ్ ట్యాంక్ ఉన్న ప్రాతంలో ఉన్న పురపాలక సంఘ స్థలంలో పార్కు ఏర్పాటుకు ప్రతిపాదించారు. అయితే ఆ ప్రతిపాదనకు అడుగులు పడలేదు. 2014 ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలుపొందిన ఆలపాటి రాజేంద్రప్రసాద్ సారధ్యంలో అక్కడ పార్కుకు శ్రీకారం చుట్టారు. 2017లో 'ఫైకస్ పార్కు'గా నామకరణం చేసి, మూడున్నర ఎకరాల్లో దానిని ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదించారు. ఆ సమయంలో తెనాలి వచ్చిన అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అమృత్ పథకంలో భాగంగా పార్కుకు శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు మున్సిపాలిటీ భాగస్వామ్యంతో మొత్తంగా రూ.1.50కోట్లతో పనులకు ప్రతిపాదించారు. టిడిపి హయాంలోనే దాదాపు రూ.కోటి విలువైన పనులు పూర్తి చేశారు. ఫైకస్ జాతి మొక్కలను ఇతర రాష్ట్రాల నుంచి తెప్పించారు. రాష్ట్రంలోనే మోడల్ పార్కుగా తీర్చి దిద్దేందుకు కృషిచేశారు. సందర్శకులు ఆహ్లాదంగా గడిపేందుకు బెంచీలను కూడా ఏర్పాటు చేశారు. ఇంకా వాకింగ్ ట్రాక్ తదితర సౌకర్యాలను ఏర్పాటు చేయాల్సి ఉంది. ఈలోగా 2019 ఎన్నికలు రావటం, ఆ ఎన్నికల్లో వైసిపి నుంచి అన్నాబత్తుని శివకుమార్ ఎమ్మెల్యేగా గెలుపొందారు. అప్పటి నుంచి దాదాపు ఐదేళ్ళ పాటు పార్కు జోలికే వెళ్ళలేదు. దీంతో ఆ పనులు మరుగున పడిపోయాయి. పార్కు మొత్తం చెత్తా చెదారం పేరుకుపోయి, ముళ్ళతుప్పలు పెరిగిపోయి, విలువైన మొక్కల పెరుగుదలకు విఘాతం కలించేంతగా ఎదిగాయి. గత ప్రభుత్వంలో చేపట్టిన పనులు మనం ఎందుకు పూర్తిచేయాలనుకున్నారో..ప్రజాధనమే కదా మనకేం నష్టం లేదనుకున్నారో తెలియదు కాని ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఫైకస్ పార్కు పనులను నిర్వీర్యం చేశారు. ఇక తాజాగా ఎన్నికల వేళ విమర్శకులను శాంతింప చేసేందుకు రూ.10లక్షల అంచనాతో వాకింగ్ ట్రాక్, జంగిల్ క్లియరెన్స్ వంటి కార్యక్రమాలను ఆగమేఘాలమీద చేపట్టారు. అసలు ఈ పార్కు ఎప్పుడు మొదలు పెట్టారు, అంచనా విలువ ఎంత అన్న వివరాలు కూడా అధికారులు చెప్పలేకపోతున్నారు. అదేమంటే మేము రాకముందే పార్కు నిర్మాణం ప్రారంభమైందని చెబుతున్నారు. అధికారి మారినా దానికి సంబంధించిన రికార్డులు కార్యాలయంలో భద్రంగా ఉంటాయన్న విషయాన్ని కూడా మరిచి, ప్రస్తుతం పర్యవేక్షిస్తున్న అధికారులే వివరాలు తెలియవని చెప్పటం వారి నిర్లక్ష్యానికి అద్దం పడుతుంది.

ఏ పనులు ఎందుకు ఆగిపోయాయో తెలియదు. ఎప్పుడు ప్రారంభించారో కూడా అధికారులకు తెలియదు. దాని అంచనా విలువా తెలియదు. ఎందుకంటే అది ప్రజాధనమే కదా... రాజుల సొమ్ము రాళ్ళపాలు అన్న చందంగా అధికారుల తీరు ఉంటే, ప్రజాప్రతినిధులు కూడా అందుకు మినహాయింపేమీ కాదు. గత ప్రభుత్వంలో ప్రారంభించిన పనులు ఈ ప్రభుత్వంలో ఎందుకు పూర్తి చేయాలి? అసలు దానితో మనకు పనేముంది? అంతగా జనం అడిగితే చూద్దాంలే అన్న తీరులో వారున్నారు. పురపాలక సంఘం పరిధిలో ఆహ్లాదకర వాతావారణం కోసం రూ.1.50 కోట్లతో ప్రతిపాదించిన ఫైకస్ పార్కు ఏడేళ్లకూ పూర్తికాని వైనాన్ని ఇందుకు నిదర్శనంగా చెప్పొచ్చు.

ఫైకస్ పార్కు అంచనాలు తెలియవు.. కాని రూ.10లక్షలతో పనులు చేపట్టాం

-ఆర్.శ్రీనివాసరావు, మున్సిపల్ డిఈ, తెనాలి

ఫైకస్ పార్కు నిర్మాణం ఎప్పుడు ప్రారంభమైందన్న వివరాలు తెలియవు. నేను ఇక్కడికి రాకముందే ప్రారంభమైంది. దాని అంచనాలు కూడా తెలియవు. ప్రస్తుతం మాత్రం రూ.10లక్షలతో పార్కులో జంగిల్ క్లియరెన్స్ చేయిస్తున్నాం. వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేస్తున్నాం. త్వరలో ప్రజలకు అందుబాటులోకి వస్తుంది.

చెరువులకు నీరు విడుదల

ప్రజాశక్తి-చేబ్రోలు

ప్రజల తాగు నీటి అవసరాలను తీర్చే వనరులలో మంచి నీటి చెరువులు, బోర్ వెల్స్ ప్రధానంగా గ్రామ పంచాయతీల పరిధిలో నిర్వహిస్తుంటారు. వేసవికాలం ఎండ తీవ్రత పెరగడంతో మంచినీటి చెరువుల్లో భారీగా నీటిమట్టాలు తగ్గిపోయాయి. తగ్గిన నీటిమట్టాన్ని కాలువల ద్వారా వచ్చే నీటితో పెంచేందుకు విధుల్లో నిమగ్నం అయిన పంచాయతీ అధికారులు, సిబ్బంది ఎండలు తీవ్రత పెరగడంతో రక్షిత మంచినీటి సరఫరా ప్రాధాన్యత అంశంకావడంతో నీటి కొరత ఏర్పడకుండా ఉండేందుకు మందస్తు చర్యలు చేపట్టడం జరిగిందని ఈ ఓ పి ఆర్ అండ్ ఆర్ డి జి శ్రీనివాసరావు తెలిపారు. మండలం లోని చేబ్రోలు, గొడవర్రు, నారాకోడూరు, వేజెండ్ల గ్రామాల్లో మంచి నీటి చెరువులు ద్వారా ప్రజలకు తాగునీరు అందిస్తామని, చేబ్రోలు గ్రామపంచాయతీ మంచినీటి చెరువు ద్వారా దాదాపు 30 వేల మంది జనాభాకు రక్షిత మంచినీరు అందుతుందని, అయితే ఎండలకు చెరువులో 70శాతం నీటి నిల్వలు తగ్గిపోయాయాని తెలిపారు. కె డబ్ల్యూ డి కొమ్మమూరు కెనాల్ ద్వారా పై నుండి నీరు రావడం జరిగుతుందని జిల్లా అధికారుల నుంచి వచ్చిన సమాచారం మేరకు కాలువల వద్ద ముందుగా మోటార్లు సిద్ధం చేశామని, మంగళవారం మధ్యాహ్నం కాలువలో నీరు రావడంతో మోటార్ల ద్వారా మంచినీటి చెరువు నింపేందుకు చేబ్రోలు పంచాయితీ సిబ్బందితో చర్యలు చేపట్టామన్నారు. ప్రస్తుతం నీటి నిల్వను పెంచామని, మరో 12రోజుల్లో కాలువల్లో నీరు అందుబాటులో ఉంటే చెరువును పూర్తిగా నింపుతామని శ్రీనివాసరావు తెలిపారు.

తాగునీటి చెరువులు నింపాలి : సిపిఎం

ప్రజాశక్తి పెదనందిపాడు రూరల్

మండలంలో నీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని సిపిఎం పెదనందిపాడు మండల కార్యదర్శి దొప్పలపూడి రమేష్ బాబు డిమాండ్ చేశారు. గురువారం సిపిఎం నాయకులు కాపు వెంకట సుబ్బారావు, కొత్త వెంకటశివరావు, చుక్కా యానాదులుతో కలిసి నాగులపాడులో వాడుకనీటి చెరువును పరిశీలించారు,. అనంతరం వారు మాట్లాడుతూ మండలం లో నాగులపాడు, పుసులూరు, ఉప్పలపాడు గ్రామా లలో నీటి సమస్య తీవ్రంగా ఉందని , చెరువులు పూర్తిగా ఎండిపోయి తాగునీరు తోపాటు కనీసం వాడుక నీరు కూడా లేక ప్రజలు తీవ్ర ఇబ్బ ఎదుర్కొం టున్నారని తెలిపారు. అధికారులు వెంటనే ట్యాంకర్ల ద్వారా నీటిని తెప్పించి ఓవర్ హెడ్ ట్యాంకులకు ఎక్కించి కుళాయిల ద్వారా నీటి సరఫరా చేపట్టాలని కోరారు. మండలంలో మిగతా గ్రామా లలో కూడా నీటి సమస్య పాక్షికంగా ఉందని నాగార్జునసాగర్ కుడికాలువ ద్వారా విడుదల చేసిన నీరు వచ్చిన వెంటనే చెరువులు నింపాలని సూచించారు. మండలంలో చెరువులలో ఉన్న నీటిని ట్యాంకర్ల ద్వారా పంచాయతీ అధికారులు అమ్మడం వల్ల ప్రస్తుతం నీటి సమస్య .తీవ్రం అయిందని తెలిపారు. ప్రైవేటు వాటర్ ప్లాంట్ నిర్వాహకులు అధిక ధరలకు నీటిని విక్రయిస్తున్నారని తమ దృష్టికి వచ్చిందని అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

నీరులేక ఎండిపోయిన నాగులపాడు చెరువును పరిశీలిస్తున్న నాయకులు

కోర్టు ఆవరణలో సవరణ పేర్లు బోర్డు ఏర్పాటు

ప్రజాశక్తి మంగళగిరి : హైకోర్టు ఉత్తర్వులు మేరకు మంగళగిరి కోర్టు ప్రాంగణంలో కోర్టుల పేర్లు సవరణ చేస్తూ రూపొందించిన బోర్డును గురువారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి వై నాగ రాజ , ప్రిన్సిపల్ సివిల్ జడ్జి సిహెచ్ వి రామకృష్ణ , ఎడిషనల్ జ్యూడిషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ జడ్జి వి. శ్రీ ప్రత్యుష, బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎస్ బాలమురళీకృష్ణ, ఉపాధ్యక్షులు కుడారి శేఖర్ బాబు, ప్రధాన కార్యదర్శులు మాలపాటి సురేంద్ర బాబు, రెంటపల్లి రాజేష్, సంయుక్త కార్యదర్శి డాక్టర్ తాతా సాంబశివరావు, మహిళా కార్యదర్శి వింజమూరి భారతీదేవి, స్పోర్ట్స్ అండ్ కల్చ రల్ కార్య దర్శి గుర్రం రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఇంటి పన్నుపై ఐదు శాతం రాయితీ

ప్రజాశక్తి-తాడేపల్లి :2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆస్తిపన్ను ఏక మొత్తం ఈ నెల 30వ తేదీలోపు ఐదు శాతం రాయితీ పొందవచ్చని ఎంటిఎంసి కమిషనర్ నిర్మల్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. పన్ను చెల్లించడానికి వీలుగా ప్రతి సచి వాలయంలో కౌంటర్లు ఏర్పాటు చేశామని, ఎంటిఎంసి ప్రధాన కార్యాలయం, తాడేపల్లి కార్యాలయంలో అదనపు కౌంటర్లు, హెల్ప్ డెస్కులు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. క్యాష్ కౌంటర్లు ఉదయం 8 గంటల నుండి రాత్రి 8 గంటల వరకు సెలవు దినాలో కూడా పని చేస్తాయని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

శివరామయ్య కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న భువనేశ్వరి

రైతు కుటుంబానికి నారా భువనేశ్వరి పరామర్శ

ప్రజాశక్తి తెనాలి : వైసిపి ఐదేళ్ల పాలనలో హైకోర్టు మినహా అన్నింటినీ తాకట్టు పెట్టిన ఘనుడు జగన్ అని టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరి అన్నారు. టిడిపి, జనసేన, బిజెపి కూటమి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, నాదెండ్ల మనోహర్, మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ తో కలిసి గురువారం రాత్రి రూరల్ గ్రామం కొలకలూరు లో ఇటీవల మృతి చెందిన రైతు దాచేపల్లి శివరామయ్య కుటుంబ సభ్యులను ఆమె పరామర్శిం చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఐదేళ్ల పాలల్లో వైసిపి అరాచకాలు, దౌర్జన్యాలు, అక్రమ కేసులు మినహా సాధించింది ఏమీ లేదన్నారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించకుండా వారిని గంజాయికి బానిసలను చేశారని ఆరోపించారు. ఒక్క పరిశ్రమను కూడా రాష్ట్రానికి రానీయకుండా అభివృద్ధిని దిగజార్చారన్నారు. తాజాగా వైసిపి ప్రభుత్వం తెచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ ఎంతో ప్రమాదకరమైందని, పేదలు వారి భూములను ఎప్పటికప్పుడు పరిశీలించుకోవాలన్నారు. పేదల సంక్షేమం అభివద్ధి కోసం చంద్రబాబు నాయుడు ప్రతిపాదించిన సూపర్ సిక్స్ పథకాలు ఎంతో ప్రయోజనమని చెప్పారు. వైసిపి పాలనకు చరమగీతం పలికేందుకు ప్రజలు సన్నద్ధం కావాలని, పేదల సంక్షేమం కోసం కట్టుబడి పనిచేస్తున్న చంద్రబాబు నాయుడుకు ప్రజలు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కూటమి పార్టీల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభిస్తున్న న్యాయవాది తాడిబోయిన శ్రీనివాసరావు

తెనాలి స్టేషన్‌రోడ్డులో చలివేంద్రం ఏర్పాటు

ప్రజాశక్తి- తెనాలిరూరల్

ఆంధ్రప్రదేశ్ బిసి నవచైతన్య సేవా సంఘం ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభించారు. గురువారం మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా తెనాలి రైల్వే స్టేషన్ రోడ్డులో మేడి పోయిన శేషయ్య జ్ఞాపకార్థం చలివేంద్రం ప్రారంభించినట్లు సేవా సంఘం అధ్యక్షుడు మేడిబోయిన గంగాయదవ్ తెలిపారు. కార్యక్రమంలో ముఖ్య అతిధిగా పాల్గున్న న్యాయవాది తాడిపోయిన శ్రీనివాసరావు చలివేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా పాదచారులకు చలివేంద్రం ఏర్పాటు చేయడం ముదావహం అన్నారు. ఎండలు తీవ్రత రోజురోజుకు పెరుగు తుందని ప్రజలు ఎండ తీవ్రతకు గురికావొద్దని సూచించారు. గురువారం ప్రారంభించిన చలివేంద్రంలో సుమారు 5 వేల మంది పాదచారులకు మజ్జిగ పంపిణీ చేసిన దాతలను కొనియాడారు. కార్యక్రమంలో తెనాలి పట్టణ యువజన అధ్యక్షులు ఆరాధ్యుల శివ యాదవ్, కరేటి రవి, కె వెంకటరావు, తాడిపోయిన వెంకట నరసయ్య, తుల్లుమిల్లి భీష్మ పాములు, యలమంద, రమణ పాల్గొన్నారు.

అభివృద్ధికి ఆమడదూరంలో గుంటూరు

- ఎన్నికల్లో నినాదాలుగా మారిన నిర్మాణాలు
- ఐదేళ్లుగా నిలిచిన యూజిడి పనులు
- భరోసా కల్పించని ప్రధాన పార్టీల అభ్యర్థులు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో మూడు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. గుంటూరు తూర్పు, పశ్చిమతో పాటు పత్తిపాడు నియోజక వర్గంలోని విలీన గ్రామాలు నగరపాలక సంస్థలో ఉన్నాయి. 2021 మార్చి 18న నగరపాలక సంస్థ కౌన్సిల్ కొలువుదీరినా నగరంలో చెప్పుకోదగ్గ అభివృద్ధి జరగలేదు. టిడిపి హయంలో యుజిడి పనుల పేరుతో రోడ్లు తవ్వేసి వదిలేస్తే తాము రోడ్ల నిర్మాణానికి అధిక ప్రాధాన్యత ఇచ్చి నిర్మించామని వైసిపి నాయకులు చెబుతుండగా వైసిపి పాలనలో నిర్లక్ష్యంకు గురైన నగరాన్ని అభివృద్ధి చేస్తామని టిడిపి అభ్యర్థులు తమ ప్రచారంలో పేర్కొంటున్నారు. టిడిపి, వైసిపి గుంటూరు నగరం అభివృద్ధి అంశంపై ఇంత వరకు సరైన భరోసా ఇవ్వలేకపోతున్నారు.

అభివృద్ధికి ఆమడదూరంలో..

నగరంలో 1967లో అరండల్‌పేట రైల్వే ఓవర్ బ్రిడ్జిని నిర్మించారు. 1964లో బ్రహ్మానందరెడ్డి స్టేడియాన్ని, పివికె నాయుడు కూరగాయల మార్కెట్‌ను, గాంధీ పార్కును ఏర్పాటు చేశారు. ఆ తర్వాత కాలంలో నగరానికి తలమానికంగా చెప్పుకోదగిన ఒక్క ప్రాజెక్ట్ కూడా ప్రభుత్వాలు చేపట్టలేదు. 2012లో సమగ్ర తాగునీటి పథకానికి అంకురార్పణ చేశారు. రూ.366 కోట్లతో ప్రారంభమైన ప్రాజెక్ట్ పనులు చేపట్టినా ఇప్పటికీ తాగునీటి సరఫరాలో అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. గోరంట్లలో నిర్మాణంలోఉన్న రిజర్వాయర్ పూర్తికాకపోవడం వల్ల విలీన గ్రామాల్లో తాగునీటి సమస్య కొనసాగుతోంది. ఇప్పటికీ అద్దె ట్యాంకర్ల ద్వారానే శివారుల కాలనీలకు రెండు రోజులకు ఒకసారి తాగునీరు అందిస్తున్నారు. అనేక ప్రధాన రోడ్ల విస్తరణ మందగించింది. వాహనాలు పెరగటంతో నిత్యం ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. అలాగే అరండల్‌పేట ఓవర్ బ్రిడ్జి విస్తరణ, శ్యామల్‌నగర్, నెహ్రూనగర్‌లో ఆర్‌యుబిల ప్రతిపాదన, రెడ్డిపాలెం వద్ద ఆర్‌వోబిల నిర్మాణంపై 10 ఏళ్లుగా ప్రతిపాదనలు కాగితాలకు పరిమితం అయ్యాయి.

యుజిడి ఇక్కట్లు

2016లో రూ.903.82 కోట్లతో కాంట్రాక్టర్ షాపూర్జి పల్లోంజి సంస్థ నిర్వహణలో ప్రారంభమైన భూగర్భ మురుగు నీటి పారుదల (యుజిడి) పనులు అసంపూర్తిగా ఉన్నాయి. ఈ ప్రాజెక్ట్‌లో భాగంగా నగర ప్రజలకు 123 మిలియన్ల లీటర్ల సామర్థ్యంతో 5 సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు,

43,320 మ్యాన్‌హోల్స్, 90వేల ఇన్స్‌పెక్షన్ ఛాంబర్లను నిర్మించాల్సి ఉంది. ఈ పనులన్నీ 2019 ఎన్నికల సమయంలో నిలిపివేయగా ఇప్పటి వరకు తిరిగి ప్రారంభం కాలేదు.గత ఐదేళ్లుగా ఈ పనులు పెండింగ్‌లో ఉండటం వల్ల ఈపథకం ప్రజలకు అందుబాటులోకి రాకుండా పోయింది. నగరంలో 1083 కిలో మీటర్ల లక్ష్యానికిగాను 503 కిలోమీటర్లు వరకూ రోడ్లు తవ్వారు. వీటి పునరుద్ధరణకు నగరపాలకసంస్థపై ఆర్థిక భారం పడింది.

పారిశుధ్య నిర్వహణ అధ్వాన్నం

గుంటూరు నగర విస్తీర్ణం విలీన గ్రామలతో కలిపి 170 కిలో మీటర్లకు పెరిగింది. 1,89,000 అసెస్‌మెంట్లు (పన్ను విధించే సముదాయాలు) ఉన్నాయి. 2000 సంవత్సరంలో 1600 మంది అవుట్‌సోర్సింగ్ పారిశుధ్య కార్మికులను విధుల్లోకి తీసుకున్నారు. అప్పట్లో రెగ్యులర్ ఉద్యోగులుగా 800 మంది కార్మికులున్నారు. సిబ్బంది కొరత పేరుతో చాలా కాలంగా శానిటేషన్ నిర్వహణ సక్రమంగా లేదు. శానిటేషన్ సిబ్బందిలో ఎక్కువ మంది ఇతర డ్యూటీలకు, అధికారులు, ప్రజాప్రతినిధుల నివాసాలకు పరిమితం అవుతున్నారు.

విలీన గ్రామాల వెతలు

2012లో గుంటూరు నగర చుట్టు పక్కల ఉన్న 10 గ్రామాలను జిఎంసిలో విలీనం చేశారు. అప్పటి నుండి ఆ గ్రామల్లో మురుగు నీటి పారుదల కాల్వల నిర్మాణంలో, తాగునీరు, రోడ్లు వంటి మౌలిక సదుపాయాలు కల్పనను జిఎంసి విస్మరించింది. సమగ్ర తాగునీటి పథకంతోనైనా విలీన గ్రామాల దాహార్తి తీరుతుదని ఆశించినా ఫలితం లేకుండా పోయింది. ప్రస్తుతం నూతనంగా గోరంట్ల కొండమీద రిజర్వాయర్ నిర్మించడానికి ప్రతిపాదనలు సిద్ధం చేసినా, పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఆయా గ్రామాల ప్రజలు వారి సమస్యలపై ఫిర్యాదు చేయటానికి వ్యయప్రయాలకు గురి అవుతున్నారు. గ్రామాల నుండి ఇక్కడికి వచ్చినా ఇక్కడ అధికారులు ఎప్పుడు ఉంటారో తెలీని పరిస్థితి నెలకొన్నది. గుంటూరు పురపాలక సంస్థగా 1866లో ఏర్పడింది. ఇప్పటికి 158 ఏళ్ల నిండాయి. అయినా ఆశించిన అభివృద్ధి జరగడం లేదు.

నేడు విజయవాడ ఎంబివికెలో

'ప్రజాస్వామ్యం - కార్పొరేట్లు - ఎన్నికల బాండ్లు'పై సదస్సు

ప్రజాశక్తి - విజయవాడ

మార్క్సిస్ట్ సిద్ధాంతకర్త, స్వాతంత్ర్య సమరయోధులు మాకినేని బసవపున్నయ్య 32వ వర్ధంతి సందర్భంగా శుక్రవారం సాయంత్రం 5.30 గంటలకు విజయవాడ నగరంలోని బాలోత్సవ భవన్ రెండో అంతస్తులో సదస్సు జరుగుతుంది. "ప్రజాస్వామ్యం - కార్పొరేట్లు - ఎన్నికల బాండ్లు" అంశంపై జరిగే ఈ సదస్సులో ప్రజాశక్తి పూర్వ సంపాదకులు ఎం.వి.ఎస్.శర్మ ఉపన్యసిస్తారు. ఎంబివికె ట్రస్ట్ చైర్మన్ పి.మధు అధ్యక్షతన జరిగే ఈ సదస్సులో ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేసింది.

రేపు యుటిఎఫ్ రాష్ట్ర విద్యా సదస్సు

ప్రజాశక్తి-గుంటూరు :ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ స్థాపించి, 50 సంవత్సరాలు పూర్తికావస్తున్న సందర్భంగా నిర్వహిస్తున్న స్వర్ణోత్సవాలలో భాగంగా ఈనెల 13న గుంటూరులోని వెంకటేశ్వరా విజ్ఞాన మందిరంలో సాయంత్రం 4.30 గంటలకు రాష్ట్ర స్థాయి విద్యా సదస్సు నిర్వహిస్తున్నట్లు యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.ఆదిలక్ష్మి, యం.కళాధర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సులో ఆర్థిక, రాజకీయ కేంద్రీకరణలు-పర్యవసానాలు అనే అంశంపై ప్రముఖ ఆర్థికవేత్త, ఇండిపెండెంట్ జర్నలిస్టు డి.పాపారావు ముఖ్య వక్తగా పాల్గొంటారని, అలాగే యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఎస్.ఎస్.ప్రసాద్, అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు, ఇతర రాష్ట్ర నాయకులు పాల్గొంటారని తెలిపారు. కావున ఉపాధ్యాయులు, విద్యావేత్తలు పెద్ద సంఖ్యలో ఈ సదస్సులో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

పోస్టల్ బ్యాలెట్‌పై కలెక్టర్ సమీక్ష

ప్రజాశక్తి-గుంటూరు :అత్యవసర శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగులు, ఎన్నికల విధుల్లో ఉండే ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకోవటంపై ఎంపిక చేసిన నోడల్ ఆఫీసర్లతో జిల్లా కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి గురువారం టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆర్టీసి, రైల్వే, మెడికల్, ఎలక్ట్రిసిటీ, పోస్టల్ తదితర 28 శాఖల్లోని ఉద్యోగులు, పోలింగ్ జరిగే మే 13న ఆయా డిపార్ట్‌మెంట్స్‌లోని నోడల్ ఆఫీసర్లు ఆయా ఉద్యోగుల వివరాలను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కార్యాలయంలోని లీగల్ సెక్షన్‌లో అందించి, ఫారం-12డి ఫారాలు పొందాలన్నారు. ఆ ఫారంలో ఉన్న పార్ట్-2 భాగం, పోలింగ్ తేదీన ఉద్యోగి విధులు నిర్వహిస్తున్నట్లు ఆ కార్యాలయ అధికారి ధృవీకరణతోపాటు, ఉద్యోగి గుర్తింపు కార్డు, ఓటు గుర్తింపు కార్డు జత చేయాలన్నారు. ఏప్రిల్ 22వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు జిల్లా ఎన్నికల అధికారి కార్యాలయంలో అందజేయాలన్నారు. ఎన్నికల తేదీన అత్యవసర విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేయటానికి ఫెసిలిటేషన్ సెంటర్స్ ఏర్పాటు చేస్తున్నామని, ఆ కేంద్రం వద్ద మాత్రమే ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు.

జిఎంసి ప్రధాన కార్యాలయంలో పన్ను చెల్లిస్తున్న ప్రజలు

ముందస్తు పన్ను చెల్లింపునకు విశేష స్పందన : కమిషనర్

ప్రజాశక్తి-గుంటూరు

ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆస్తి పన్నును ముందస్తుగా ఏప్రిల్ నెలాఖరులోపు చెల్లించే వారికి మొత్తం పన్నుపై కల్పించిన 5 శాతం రాయితీని వినియోగించుకునేందుకు నగర ప్రజల నుండి విశేష స్పందన లభిస్తుందని నగర కమిషనర్ కీర్తి చేకూరి తెలిపారు. పన్ను చెల్లింపుదారులకు వీలుగా సెలవు రోజుల్లో సైతం జిఎంసి క్యాష్ కౌంటర్లు పనిచేస్తాయన్నారు. పన్ను చెల్లింపు సమాచారం కోసం జిఎంసి ప్రధాన కార్యాలయం, సర్కిల్ కార్యాలయంల్లో హెల్ప్ డెస్కులు ఏర్పాటు చేశామన్నారు. ఉదయం 8 గంటల నుండి రాత్రి 8 గంటల వరకూ క్యాష్ కౌంటర్లు పనిచేస్తాయని చెప్పారు. జిఎంసి ప్రధాన కార్యాలయం, బృందావన్ గార్డెన్స్‌లోని సర్కిల్ ఆఫీసు, భారత్‌పేటలోని 140, పెదపలకలూరు రోడ్డులోని 106, వసంతరాయపురం మెయిన్ రోడ్డులోని 148 వార్డు సచివాలయాల్లోనూ క్యాష్ కౌంటర్లు ఏర్పాటు చేశామన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు

ప్రత్యేక పరిశీలకులు విశ్రాంత ఐపిఎస్ అధికారి దీపక్ మిశ్రా

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

సార్వత్రిక ఎన్నికల విధులలో పోలీస్ సిబ్బంది నిష్పక్షపాతంగా పకడ్బందీగా విధులు నిర్వహించాలని పోలీస్ ప్రత్యేక పరిశీలకులు విశ్రాంత ఐపీఎస్ అధికారి దీపక్ మిశ్రా అన్నారు. పల్నాడు జిల్లా కేంద్రం నరస రావుపేట కలెక్టరేట్‌లో గురువారం ఎన్నికల నిర్వహ ణపై సమీక్ష సమా వేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి జిల్లాలో ఎన్నికల నిర్వహణపై తీసుకుంటున్న చర్యలను పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. పోలింగ్ స్టేషన్లో కనీస వసతులు, సి విజిల్ యాప్, మోడల్ కోడ్ ఆఫ్ కండక్టర్ తదితర అంశాలపై వివరించారు. అనంతరం జిల్లా ఎస్పీ బిందు మాధవ్ మాట్లాడుతూ ఈ ఎస్ ఎం ఎస్ విధులలో భాగంగా ఇప్పటివరకు రూ 1.40 కోట్లను సీజ్ చేసినట్లు వివరించారు. అదే విధంగా ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్టులు ఇంటర్ డిస్ట్రిక్ట్ చెక్‌పోస్టులు మరియు జిల్లా సరిహద్దుల వద్ద తీసుకుంటున్న చర్యలను వివరించారు. అనంతరం స్పెషల్ పోలీస్ పరిశీలకులు దీపక్ మిశ్రా మాట్లాడుతూ ఎన్నికల సమయంలో విధులు బాధ్యతగా వ్యవహరించాలని రానున్న తరానికి మంచి సమాజాన్ని అందించేలా ఎన్నికలు నిర్వహించాలన్నారు. ఎన్నికల విధులలో ఒక వర్గానికి గాని ఒక రాజకీయ పార్టీకి గాని అనుకూలంగా వ్యవహరించ కూడదని, ఎన్నికల విధులలో అలసత్వం వహించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో లా అండ్ ఆర్డర్ అడిషనల్ డీజీపీ సంకబ్రత భాగ్చీ, గుంటూరు రేంజి ఐజి సర్వ శ్రేష్ట త్రిపాఠి, జాయింట్ కలెక్టర్ ఏ శ్యాంప్రసాద్, జిల్లా రెవెన్యూ అధికారి కె.వినాయకం పోలీస్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్, పోలీస్ అధికారులు

పార్కిన్సన్స్‌పై లలిత హాస్పిటల్‌లో అవగాహన సదస్సు

ప్రజాశక్తి-గుంటూరు

పార్కిన్సోనిజం వ్యాధిపై అవగాహనకు ప్రపంచ పార్కిన్సన్స్ దినోత్సవం సందర్భంగా గురువారం స్థానిక లలితా హాస్పిటల్ ఆవరణలో న్యూరోసైన్స్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్కిన్సన్స్, ఎండిఎస్ క్లినిక్ అనే ప్రత్యేక ఓపిడి క్లినిక్స్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎపిఎన్ఎస్ఎ ప్రెసిడెంట్ డాక్టర్ పి.విజయ మాట్లాడుతూ పార్కిన్సన్స్ వ్యాధి నరాల సంబంధిత రుగ్మత అని, ఇది దేశంలో వేగంగా పెరుగుతుందన్నారు. 60 ఏళ్ల పైబడిన వారిలో 1 శాతం మంది ఈ వ్యాధితో బాధపడుతున్నారని తెలిపారు. వణుకు, మాట తడబడటం, నడక మందగించటం, తూలు, తరచూ పడిపోవటం, మలబద్ధకం, నిద్ర సమస్యలు ఈ వ్యాధి ముఖ్యలక్షణాలన్నారు. వ్యాధి లక్షణాలు, కారణాలు, చికిత్సల గురించి పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా డాక్టర్ విజయ వివరించారు.

డిబిఎస్ చికిత్స గురించి బ్రోచర్ విడుదల చేస్తున్న డాక్టర్ విజయ, తదితరులు

పార్కిన్సన్స్‌కు డీప్ బ్రెయిన్ స్టిమ్యులేషన్ అనే అధునాతన చికిత్స విధానాన్ని లలిత సూపర్‌స్పెషాలిటీ హాస్పిటల్‌లో త్వరలో ప్రారంభిస్తామని చీఫ్ న్యూరోసర్జన్ డాక్టర్ ఎన్.శ్రీనివాసరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎన్.శ్రీనివాసరావు, డాక్టర్ బి.ఉషాకిరణ్, డాక్టర్ వై.రామచంద్ర, డాక్టర్ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా పూలే జయంతి వేడుకలు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

స్థానిక ట్రావెలర్స్ బంగ్లా వద్ద మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పూలే దాదాపు 150 ఏళ్ల కిందటే కుల వివక్షకు వ్యతిరేకంగా పోరాడారని గుర్తుచేశారు. బడుగు, బలహీన వర్గాల ఆత్మగౌరవాన్ని ఆయన ఘనంగా చాటారని తెలిపారు. స్త్రీలు అభివద్ధి చెందనిదే సమాజం అభివద్ధి చెందదన్న వాస్తవాన్ని గుర్తించి దేశంలోనే తొలి బాలికా పాఠశాలను ప్రారంభించి స్త్రీ విద్యను ప్రోత్సహించారని గుర్తుచేశారు. తన భార్య సావిత్రిబాయి పూలేకు చదువు చెప్పించి ఆమెను తొలి మహిళా ఉపాధ్యాయురాలిగా తయారు చేశారని పేర్కొన్నారు. సాయిబాబా రోడ్డు చంద్రమౌళి నగర్‌లోని వైసిపి కార్యాలయంలో జ్యోతిరావు పూలే చిత్రపటానికి మంత్రి విడదల రజిని పూలమాల వేసి నివాళు లర్పించారు. పూలేవిగ్రహానికి నివాళులు అర్పించిన వారిలో మాజీ మంత్రి డొక్కామాణిక్య వర ప్రసాద్, టిడిపి అభ్యర్థి గల్లా మాధవి,జాతీయ బీసీ బహుజన ఫ్రంట్ అధ్యక్షులు తాటికొండ నరసింహా రావు, సామాజిక న్యాయ కేంద్రం కన్వీనర్ వైకోటేశ్వరావు, పలు బిసి ప్రజాసంఘాల ఆధ్వర్యంలో గుంటూరు స్థానిక హిందూ కాలేజీ సెంటర్‌లో మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. బహుజన మహాసభ జాతీయ అధ్యక్షులు జి ఆర్ భగత్ సింగ్ రజక జనసేవ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జూపూడి శ్రీనివాసరావు నాయి బ్రాహ్మణ జేఏసీ అర్బన్ కమిటీ కో కన్వీనర్ తాళ్లూరి శ్రీను రజక మహిళా అధ్యక్షురాలు వేంపాటి విజయలక్ష్మి చేనేత సంఘం సీనియర్ నాయకులు గుర్రం చిన్న వీరయ్య అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు బత్తుల వీరాస్వామి ఆర్ పి ఐ పార్టీ రాష్ట్ర నాయకులు విప్పర్ల ముత్తయ్య అనేకమంది బిసి దళిత ప్రజా సంఘాల నేతలు పాల్గొన్నారు.